# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 25-8-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 18 | పేజీలు 8 | వెల: రూ.1/-


## జైట్లీ మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, ఆగష్టు 24: బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మరణంపట్ల టీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జైట్లీ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. దేశానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. జైట్లీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థించినట్లు కేసీఆర్ పేర్కొన్నారు.

కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు.

# అరుణ్‌జైట్లీ అస్తమయం



- అనారోగ్యంతో చికిత్స పొందుతూ కన్నుమూత
- కొంతకాలంగా ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న జైట్లీ
- జైట్లీ మృతితో శోకసంద్రంలో బీజేపీ శ్రేణులు
- మంచి స్నేహితుడ్ని కోల్పోయానన్న ప్రధాని మోదీ
- సంతాపం తెలిపిన తెలుగు రాష్ట్రాల సీఎంలు

న్యూఢిల్లీ, ఆగస్టు24(ఆంఎన్ఎ) : కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత అరుణ్ జైట్లీ అనారోగ్యం కారణంగా శనివారం ఢిల్లీ ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. ఆగష్టు 9న ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను ఎయిమ్స్‌లో చేర్పించారు. 15 రోజులపాటు చికిత్స పొందిన ఆయన.. ఆరోగ్యం విషమించడంతో శనివారం తుదిశ్వాస విడిచారు. జైట్లీ ప్రాణాలు నిలిపేందుకు వైద్యులు శతథా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. జైట్లీ ఎయిమ్స్‌లో చేరిన రోజే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, హర్షవర్ధన్, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తదితరులు ఎయిమ్స్‌కు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. డయాబెటిస్ కారణంగా బాగా బరువు పెరిగిపోయిన జైట్లీ 2014లో బేరియాట్రిక్ సర్జరీ చేయించుకున్నారు. 66 ఏళ్ల జైట్లీ గత ఏడాది కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నారు. ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఆయన.. ఈ ఏడాది జనవరిలో రెగ్యులర్ మెడికల్ చెకప్ కోసం అమెరికా వెళ్లారు. దీంతో బ్జడెట్‌ను పియూష్ గోయల్ ప్రవేశపెట్టారు. వృత్తిరీత్యా లాయర్ అయిన జైట్లీ ప్రధాని తొలి కేబినెట్లో కీలక మంత్రిగా, ట్రబుల్ షూటర్‌గా వ్యవహరించారు. ఆయనకు క్యాన్సర్ రావడంతోనే చికిత్స కోసం జనవరిలో అమెరికా వెళ్లారని ప్రచారం జరిగింది. 2019 లోక్ సభ ఎన్నికల్లో జైట్లీ పోటీ చేయలేదు. అనారోగ్యం కారణంగా బాధ్యతలు తీసుకోవడానికి తాను సిద్ధంగా లేనని ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక ప్రధాని మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. గతంలో మృత్‌సర్ నుంచి అరుణ్ జైట్లీ పోటీ చేస్తున్నారనే విషయం తెలియగానే ఆ నియోజకవర్గంలో దాదాపు 40 భాజపా కార్యాలయాలు స్వచ్ఛందంగా తెరుచుకున్నాయి. అవన్నీ ఆయన బంధువులు, మిత్రులు నివసించే ఇళ్లే. వారంతా జైట్లీ గెలువు తమ సొంత పని అయినట్లు అహోరాత్రులు కష్టపడ్డారు. ఇక్కడ ఇంకో ఆసక్తికరమైన అంశం ఉంది.. జైట్లీ కోసం ప్రచారానికి వచ్చిన డాక్టర్లు, ఇంజినీంలో అత్యధికులు ఆయన మీద ప్రేమతో వచ్చినవారే. వారంతా ఆయన చలువతోనే విద్యాభ్యాసం పూర్తి చేసి మంచి జీవితంలో స్థిరపడ్డారు. అరుణ్ జైట్లీలో పైకి కనిపించే గాంభీర్యం మాటున ఒక మంచి మనసు దాగి ఉంది. మనసున్న మారాజుగా జైట్లీని సన్నిహితులు అభివర్ణిస్తుంటారు.

### లాహోర్ నుంచి అమృత్‌సర్‌కు..

అరుణ్ జైట్లీ 1952లో మహారాజ్ కిషన్ జైట్లీ, రతన్ ప్రభ దంపతులకు ఢిల్లీలో జన్మించారు. తండ్రి కిషన్ స్వస్థలం ప్రస్తుత పాకిస్థాన్‌లోని లాహోర్. ఆయన అక్కడ పేరు ప్రఖ్యాతులు కలిగిన న్యాయవాది. తల్లి రతన్ ప్రభది పంజాబ్‌లోని అమృత్‌సర్. దేశవిభజన సమయంలో కిషన్ జైట్లీ ఢిల్లీకి నారాయణ్ విహార్‌కు వచ్చి ప్రాక్టీస్ ప్రారంభించారు. అక్కడే అరుణ్‌జైట్లీ జన్మించారు. జైట్లీ విద్యాభ్యాసం మొత్తం మంచి పేరున్న విద్యాలయాల్లోనే జరిగింది. సెయింట్ జేవియర్ స్కూల్, శ్రీరామ్ కామర్స్ కాలేజ్, లా విద్యాభ్యాసం ఢిల్లీ యూనివర్సిటీల్లో చదివారు. ఢిల్లీలోని అత్యంత ప్రముఖ న్యాయవాదుల్లో జైట్లీ కూడా ఒకరు. పన్ను చట్టాలు, ఆర్థిక వ్యవహారాలు ఆయనకు కొట్టిన పిండి. కోర్టులో ప్రత్యర్థులకు చుక్కలు చూపించేవారని పేరు. కానీ, తన గుమాస్తాల విషయంలో మాత్రం జైట్లీ ఎంతో ఉదారంగా ఉండేవారు. ప్రతి కేసులోను ప్లీడర్ గుమాస్తాలకు ఇచ్చే ఖర్చులను నేరుగా వారికే ఇప్పించేవారు. దీంతో పాటు వారి సిబ్బంది పిల్లల చదువులకు అవసరమైనప్పుడల్లా ఆర్థిక సాయం చేసేవారు. సిబ్బంది పిల్లల పెళ్లిళ్లకు ఢిల్లీలోని ఇంటిని వేదికగా చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

### ఇందిరా గాంధీపై పోరాటం..

జైట్లీ తొలి అరెస్టు ఎమర్జెన్సీ సమయంలో జరిగింది. ఆయన లా విద్యను అభ్యసిస్తున్న సమయంలో అప్పటి దేశ ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారు. దీంతో విద్యార్థి నాయకుడైన జైట్లీ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించారు. ఫలితంగా ఆయన్ను మీసా చట్టం కింద అరెస్టు చేసి జైల్లో వేశారు. 19నెలలు జైల్లోనే గడిపారు. దీంతో ఒక విద్యా సంవత్సరాన్ని నష్టపోయారు. జైలు నుంచి రాగానే ఏబీవీపీలో చేరి ఢిల్లీ విభాగం అధిపతిగా, ఆల్ ఇండియా విభాగానికి జనరల్ సెక్రటరీగా ఎదిగారు. ఢిల్లీలోని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ భవనాన్ని ఇందిరాగాంధీ ప్రభుత్వం కూల్చివేయాలని నిర్ణయించడంతో దానికి వ్యతిరేకంగా జైట్లీ పోరాడారు. అప్పుడే ఆయనకు న్యాయకోవిదులు ఫాలీనారిమన్, ఎస్.గురుమూర్తి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అధిపతి రామ్‌నాథ్ గోయంకాలతో పరిచయం ఏర్పడింది. 1987లో ఢిల్లీలో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన జైట్లీని ఆ తర్వాత రెండేళ్లకే వీపీ సింగ్ ప్రభుత్వం అదనపు సోలిసిటర్ జనరలగా 1989లో నియమించింది. బోఫోర్స్ కేసుకు సంబంధించిన పేపర్ వర్క్ మొత్తం జైట్లీనే చేశారు.

### వాజ్‌పేయి కేబినెట్‌లో మంత్రిగా..

1999లో వాజ్‌పేయి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పుడు తొలిసారి మంత్రిగా ఆయన పెట్టుబడుల ఉపసంహారణ శాఖను చేపట్టారు. ఆ శాఖను ప్రారంభించడం అదే తొలిసారి. న్యాయకోవిదుడైన రాంజెఠ్మలనీ ఆ శాఖకు రాజీనామా చేయడంతో ఆ బాధ్యతలు కూడా జైట్లీనే స్వీకరించారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ల చట్టం రూపకల్పనలో జైట్లీనే కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత పార్టీ బాధ్యతల కోసం కేబినెట్ నుంచి వైదొలగినా.. 2003లో మళ్లీ కామర్స్ అండ్ లా మినిస్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2009లో అద్వాణీ ఆయన్ను రాజ్యసభలో పార్టీ నాయకుడిగా నియమించారు. అనంతరం 2014 ఎన్నికల్లో మోదీ హయాంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వంలో పలు కమిటీలు ఉంటాయి. అందులో కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) ఒకటి. ప్రధాని అధ్యక్షత వహించే ఈ కమిటీలో రక్షణ, ఆర్థిక, హోం, విదేశీ వ్యవహారాల శాఖా మంత్రులు మాత్రమే సభ్యులుగా ఉంటారు. మొత్తం నాలుగు శాఖల్లో రెండు శాఖలను చూసేది జైట్లీనే. దీనినిబట్టి మోదీ కేబినెట్‌లో జైట్లీకున్న ప్రాధాన్యం ఏమిటో అర్థమవుతుంది. 2016 మే 26న మోదీ మంత్రివర్గ ప్రమాణస్వీకారం అనంతరం రెండు కీలక శాఖలైన ఆర్థిక, రక్షణను అరుణ్‌జైట్లీకి అప్పగించారు. తర్వాత కొన్నాళ్లకు రక్షణ శాఖను మనోహర్ పారికర్‌కు అప్పగించినా.. ఆయన గోవా సీఎంగా వెళ్లిన తర్వాత మళ్లీ నిర్మలా సీతారామన్ ఆ బాధ్యతలు చేపట్టేవరకు రక్షణ మంత్రిగా జైట్లీ వ్యవహరించారు. మళ్లీ 2019లో రెండవ సారి మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత కేబినెట్‌లో చేరాలని మోదీ కోరడంతో ఆరోగ్యం సహకరించడం లేదని మోదీ వినతిని తిస్కరించారు. అప్పటికే తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జైట్లీ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు.న

### మోదీకి బలమైన మద్దతుదారు..

అరుణ్ జైట్లీ నేటి ప్రధాని నరేంద్ర మోదీకి బలమైన మద్దతుదారుగా నిలిచారు. ప్రధాని అభ్యర్థిత్వంపై పార్టీ సీనియర్ నాయకులు పెదవి విరిచినా మోదీకి మద్దతు ఇచ్చారు. అంతేకాదు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఎంపిక కూడా జైట్లీ మద్దతుతోనే జరిగింది. అప్పట్లో ఉమాభారతి వ్యతిరేకించినా.. ఆయన చౌహాన్‌కే ఓటు వేశారు. ఆ తర్వాత చౌహాన్ మధ్యప్రదేశ్‌లో మూడుసార్లు భాజపాను నిలబెట్టారు. ఇక నోట్ల రద్దు, జీఎస్‌టీ, దివాలా చట్టానికి కోరలు తొడగడంలో జైట్లీ కీలక పాత్రను పోషించారు. భారతీయ జనతా పార్టీలో ఎన్నికల వ్యూహాలు రచించడంలో జైట్లీ దిట్ట. భాజపా అధ్యక్షుడు అమిత్‌షా కన్నా ముందునుంచే పార్టీకి వ్యూహాలు రూపొందించేవారు. లోక్‌సభ ఎన్నికలైనా, రాష్ట్రాలకు జరిగే అసెంబ్లీ ఎన్నికలైనా జైట్లీ పాత్ర ఉండాల్సిందే. భాజపా ప్రధాన కార్యదర్శిగా పార్టీ విజయంలో కీలకపాత్ర పోషించిన ఆయన.. వలు రాష్ట్రాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. ఆయనలాగా రాష్ట్రాల బాధ్యతలు బహుశా మరే భాజపా నేతా చూసుండకపోవచ్చు. ఆయన 2002లో గుజరాత్ రాష్ట్ర ఎన్నికల సందర్భం గా భాజపా ప్రచారబాధ్యతలను చూశారు. మధ్యప్రదేశ్, బిహార్, కర్ణాటక, పంజాబ్, హిమాచల ప్రదేశ్, గోవా, మహారాష్ట్ర, జమ్మూకశ్మీర్, ఢిల్లీ, అసోం, పశ్చిమబెంగాల్ వంటి కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బాధ్యతను పార్టీ తంపున తనపై వేసుకున్నారు. తనదైన వ్యూహాలతో చాలాచోట్ల పార్టీకి విజయం అందించేందుకు కృషిచేశారు.

### జైట్లీ మృతికి ప్రముఖుల సంతాపం..

అనారోగ్యంతో కన్నుమూసిన కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ మృతిపట్ల పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఓ గొప్ప, నిజాయతీ గల నేతను కోల్పోయామంటూ సోషల్‌మీడియా వేదికగా జైట్లీ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

### మంచి స్నేహితుడిని కోల్పోయా - ప్రధాని మోదీ

భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం యూఏఈ పర్యటనలో ఉన్న మోదీ.. జైట్లీ మరణవార్త తెలియగానే ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఓ మంచి స్నేహితుడిని కోల్పోయానంటూ ఆవేదన చెందారు. అరుణ్ జైట్లీ రాజకీయ దిగ్గజమని, అత్యున్నత మేధో సంపత్తి గల వ్యక్తి అని కొనియాడారు. దేశం కోసం నిరంతరం సేవ చేసిన నేత. సమాజంలోని అన్ని రంగాల ప్రజలకు ఆయన స్ఫూర్తిదాయకంగా నిలిచారని, భారత రాజ్యాంగం, చరిత్ర, ప్రజా విధానాలు, పాలనా వ్యవహారాలపై సునిశిత విజ్ఞానం ఆయన సొంతమన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన ఎన్నో మంత్రిత్వ బాధ్యతలు చేపట్టారన్నారు. అలా దేశ ఆర్థిక వృద్ధి, రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేసేందుకు సహకారం అందించారని, భాజపాకు, జైట్లీకి విడదీయరాని అనుబంధం ఉందని, విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుంచే దేశం కోసం పాటుపడ్డారన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు ఎంతో శ్రమించారని, ఆయన మృతి విచారకరమని, ఓ మంచి స్నేహితుడిని కోల్పోయానని మోదీ సంతాపం తెలిపారు. జైట్లీ భార్య సంగీత, కుమారుడు రోషన్‌తో మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఈ కారణంగా విదేశీ పర్యటనను అర్థంతరంగా ముగించొద్దని జైట్లీ కుటుంబసభ్యులు మోదీని కోరినట్లు తెలిసింది.

### వ్యక్తిగతంగా నాకు పెద్దలోటు - కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

అరుణ్‌జైట్లీ మృతి తీవ్రంగా కలచివేస్తోందని, వ్యక్తిగతంగా నాకు పెద్ద లోటు అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. మా కుటుంబ సభ్యుడినే కోల్పోయినంత బాధగా ఉందని, నాకు ఎల్లప్పుడూ మార్గ దర్శకంగా నిలిచే వ్యక్తి ఆయన అన్నారు. అదేవిధంగా రాజ్యసభ్యు డు సీఎం రమేష్ జైట్లీ మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జైట్లీ మృతి విచారకరం మని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నామని, ఓ గొప్ప, నిజాయతీ గల నేతను కోల్పోయా మని అన్నారు. బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ జైట్లీ మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి, శ్రేయోభిలాషులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా అన్నారు. జైట్లీ మృతిపట్ల కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నా మంచి స్నేహితుడు, గొప్ప రాజకీయ నాయకుడు, అద్భుతమైన పార్లమెంటేరియన్ జైట్లీ మరణవార్త విని దిగ్భ్రాంతికి లోనయ్యా అని అన్నారు. ఆయన లేని లోటు ఎన్నటికీ తీర్చలేనిదని, ఆయన ఎప్పటికీ మా హృదయాల్లో గుర్తుండిపోతారని సురేశ్ ప్రభు పేర్కొన్నారు. అదేవిధంగా రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోత్ జైట్లీ మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జైట్లీ మృతి బాధాకరమని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని, ఆయన కుటుంబానికి ఈ పరిస్థితిని తట్టుకునే ధైర్యాన్ని ఇవ్వాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాల సీఎంలు జగన్‌మోహన్‌రెడ్డి, కేసీఆర్‌లు జైట్లీ మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. టీడీపీ అధినేత, ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు జైట్లీ మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం గొప్ప నేతను కోల్పోయిందని అన్నారు.

## జీఎస్టీ రూపకర్త జైట్లీ

**- ల్యాండ్ మార్క్ సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థలో తనదైన ముద్ర**

న్యూఢిల్లీ, ఆగస్టు24(ఆర్ఎన్ఎ) : భారతదేశంలో పరోక్ష పన్నుల విధానంలో వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) అమల్లోకి రావడంలో కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఎంతో కృషి చేశారు. పన్నుల సంస్కరణకు పెద్దపీట వేయడంతో పాటు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీఎస్టీని తాను ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలోనే విజయవంతంగా అమల్లోకి తెచ్చారు. ల్యాండ్ మార్క్ సంస్కరణలతో భారత ఆర్థిక వ్యవస్థలో తనదైన ముద్రవేశారు. దేశమంతా ఒకే పన్ను ఉండాలనే ఆలోచన 1986-87లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ హయంలో బీజం పడింది. పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో సరళీకృత ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత 1999లో అటల్ బిహారి వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు జీఎస్టీ విధానం పురుడుపోసుకుంది. అనంతరం 2006-07 బ్జడెట్ సమయంలో అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం జీఎస్టీపై తొలి ప్రకటన చేశారు. 2010 ఏప్రిల్ నుంచి జీఎస్టీ అమల్లోకి వస్తుందని ప్రకటన చేసినా అప్పుడు అమల్లోకి రాలేదు. 2009లో ప్రణబ్ ముఖర్జీ కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో జీఎస్టీ కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. 2011లో జీఎస్టీ అమలు చేసేందుకు వీలుగా 115వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రణబ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ జీఎస్టీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించింది. 2014లో మోదీ సారథ్యంలో కేంద్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2016 ఆగస్టులో జీఎస్టీ సవరణ బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. వెంటనే జీఎస్టీ కమిటి ఏర్పాటైంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆమోదం తెలిపాయి. రాష్ట్రాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపడానికి జైట్లీ స్వయంగా రంగంలోకి దిగి రాష్ట్రాలతో మాట్లాడారు. జీఎస్టీ అమలుతో నష్టపోయే రాష్ట్రాలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. జీఎస్టీ చట్టం కోసం జైట్లీ విశేష కృషి చేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు 2016 ఆగస్టులో జరగ్గా, 175 అధికారుల సమావేశాలు, 18 జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. సుమారు 30 సబ్-గ్రూపులు, కమిటీలు 1200 వస్తు, సేవల పన్నును నిర్ణయించడానికి సుదీర్ఘకాలంగా శ్రమించారు. చివరికి కేంద్ర జైట్లీ నేతృత్వంలో జీఎస్టీ కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకుంది. అరుణ్ జైట్లీ 9 నెలల పాటు సగటున రెండుసార్లు సమావేశాల్లో పాల్గొనడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రానికి మధ్య సమ్మతి కుదిరేలా అభిప్రాయబేధాలను వెనువెంటనే పరిష్కరించడంలో ఎంతో కృషి చేశారు. జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వస్తుందని 2017 జనవరిలో జైట్లీ ప్రకటించారు. అదే ఏడాది మేలో నాలుగంచెల జీఎస్టీ పన్నుల విధానాన్ని ప్రకటించింది. అలా జీఎస్టీ అమల్లోకి రావడానికి 17ఏండ్ల సుదీర్ఘ సమయం పట్టింది. అదేఏడాది జూన్ 30 అర్ధరాత్రి అట్టహాసంగా జీఎస్టీ అమలుకావడంతో దీన్ని అమలు చేస్తున్న ఏడో దేశంగా భారత్ అవతరించింది.

## మహారాష్ట్రలో ఘోర విషాదం

**భివాండిలో భవనం కూలి ఇద్దరు మృతి**

ముంబై,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో ఘోరం జరిగింది. నాలుగు అంతస్థుల భవనం ఉన్నట్టుండి కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, మరో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మహారాష్ట్రలోని భివాండీ నగరంలో శనివారం ఉదయం ఈ ఘటన జరిగింది. భివాండి నగరంలోని శాంతినగర్‌లో నాలుగు అంతస్థుల భవనం కుప్పకూలి పోయింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. ఘటన జరిగిన వెంటనే నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ రంగంలోకి దిగి తీవ్రంగా గాయపడిన ఐదుగురు వ్యక్తులను కాపాడి ఆసుపత్రికి తరలించారు. ఈ భవనం 8 ఏళ్ల క్రితం అక్రమంగా నిర్మించారని, దీన్ని కూల్చాలని నిర్ణయించి అధికారుల బృందాలను పంపించామని, ఈ లోగా కూలిపోయిందని భివాండీ మున్సిపల్ కమిషనర్ అశోక్ చెప్పారు. ఈ భవనంలో నివశిస్తున్న వారిని తాము ఖాళీ చేయించినా, కొందరు అక్రమంగా భవనంలోకి ప్రవేశించారని కమిషనర్ పేర్కొన్నారు. అక్రమంగా భవనంలోకి వచ్చిన వారు ప్రమాదం బారిన పడ్డారు. అగ్నిమాపక శాఖ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయ కార్యక్రమాలు చేపట్టారు.

ఆగస్టు నెలలో..

## బీజేపీకి తీపీ, విషాదం!

**- మోదీ సర్కార్ సంచలన నిర్ణయాలకు వేదికైన ఆగస్టు నెల**

**- ఇదే నెలలో ఇద్దరి సీనియర్ నేతల మృతి**

న్యూఢిల్లీ,ఆగస్టు24 (ఆర్ఎన్ఎ): ఆగష్టు నెల బీజేపీ చరిత్రలోనే ఎప్పటికీ గుర్తుండి పోతుంది. రెండో దఫా అధికారంలోకి వచ్చి మూడు నెలలైనా కాకముందే మోదీ సర్కారు ఆర్టికల్ 370 రద్దు లాంటి సంచలన నిర్ణయం తీసుకుంది. ఎప్పటి నుంచో ఇస్తోన్న హామీని నెరవేర్చిన బీజేపీ మాట నిలబెట్టుకుంది. ఈ విషయంలో ప్రతిపక్ష నేతలు సైతం మోదీ నిర్ణయాన్ని మెచ్చుకున్నారు. కశ్మీర్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా అక్కడి నుంచి పర్యాటకులను వెనక్కి పంపి, అదనపు బలగాలను లోయలో మోహరించారు. అంతర్జాతీయంగానూ పాకిస్థాన్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్మూ కశ్మీర్ సమస్యను పరిష్కరించిన ఆనందంలో ఉండగానే సుష్మా స్వరాజ్ హఠాన్మరణం బీజేపీ శ్రేణులను కలచి వేసింది. కార్డియాక్ అరెస్టుతో కుప్పకూలడానికి గంటన్నర ముందు కూడా ఆమె ప్రధాని మోదీని ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. ఐసీజేలో కుల్‌భూషణ్ కేసును వాదించిన హరీశ్ సాల్వేకు ఫోన్ చేసి ఉదయాన్నే వచ్చి ఫీజుగా ఇస్తానన్న ఒక్క రూపాయి తీసుకెళ్లమని కోరారు. ఆగష్టు 6న రాత్రి సమయంలో సుష్మా మరణించగా.. మోదీ తొలి కేబినెట్లో ఆమెతోపాటు కలిసి పని చేసిన అరుణ్ జైట్లీ రెండ్రోజుల వ్యవధిలోనే అనారోగ్యంతో ఎయిమ్స్‌లో చేరారు. ఆయన ఆరోగ్యం పట్ల బీజేపీ సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ, అమిత్ షా, అద్వానీ లాంటి కీలక నేతలు హుటాహుటిన ఎయిమ్స్‌కు వెళ్లి రావడంతో.. అరుణ్ జైట్లీ ఆరోగ్యం కూడా విషమించిందని భావించారు. కానీ డాక్టర్లు శక్తిమేరా ప్రయత్నించడంతో ఆయన చికిత్సకు స్పందించారు.

15 రోజులపాటు ఎయిమ్స్‌లో చికిత్స పొందిన జైట్లీ.. శనివారం తుదిశ్వాస విడిచారు. ఆగష్టు నెల తీపి గుర్తుగా మిగిలిపోతుందని భావించిన బీజేపీ నేతలకు సుష్మా, జైట్లీ మరణాలు చేదు గుళికగా మారాయి. ఒకే నెలలో ఇద్దరు కీలక నేతలు చనిపోవడంతో బీజేపీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి. ఇకపోతే ఏడాదిలో బిజెపికి చెందిన ఐదుగురు ప్రముఖనేతలు మృతి చెందారు. వాజ్‌పేయ్,అనంతకుమార్, మనోహర్ పారికర్, సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీ మృతి చెందారు.



దుబాయ్‌లో ప్రధాని మోదీ సమక్షంలో రూపేకార్డును ఆవిష్కరించిన దృశ్యం

### చరిత్రలో నేటినిజం



కం॥ జ్ఞానము తా గూడిన-వి
జ్ఞానమ్మునకై క్రతువును సాగించుటచే
ధీనిధిగా పేరొందెను
మానిత గుణుడైన-చణుడు-"మైకేల్ ఫారడే"!!

( ఆగష్టు 25 మైకేల్ ఫారడే పుణ్యతిథి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

# రోజువారీ నిత్యకృత్యాలే.!

నేటినిజం

ఆదివారం 25-8-2019

ఆరోగ్యానికి ఆకుకూరలు, కూరగాయలు చాలా మంచివి అనేది తెలిసిందే! కళ్ళల్లో వత్తులేసుకుని పండించిన వీటిని కడుపులో దాచుకున్నట్టు బుట్టలో మూటల్లో దాచి, ప్రాణానికి మిన్నగా భావించి, తన ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా తెలవారక ముందే మార్కెట్‌కు తరలిస్తాడు రైతు. గంపెడంత ఆశతో మాటల్లో చెప్పలేని బాధతో వాటిని అమ్మకానికి పెడతాడు. మూడ విప్పకముందే రాబందుల్లా చిలకపలుకుల్లో దళారీలు మీద పడతారు. ధర ఇంతేనంటూ బేరం చేయకుండానే తన్నుకుపోతారు. చేస్తలుడిగిన రైతు చేతిలో పెట్టింది తీసుకోవల్సిందే! లేదంటే తాను ఇస్తానన్న రోజు తీసుకోడనే దిగులు లేదా తాను అమ్ముదామనుకుంటే మార్కెట్లో ఓ చదరపు అడుగు దొరకడం కష్టం. దొరికిన చోట కూర్చుంటే నీ జాగీరా! అంటూ అక్కడే తిష్టవేసి అమ్ముకునేవారి దబాయింపు. మరోవైపు కూర్చోకముందే తై బజారు పేరున మార్కెడ్ సెస్ టికెట్లు మూటలపై పడతాయి! అయ్యా! బేరం రాలేదు. బోణీ కాలేదు అని అంటే నాకనవసరం..తియ్యి" అంటూ బెదిరింపులు.. అమ్మినంక ఇస్తా! యాడికిపోత... "నిన్నెట్లా నమ్మేది? అమ్మి దొంగలా పోతే నా బతుకేం కాను?" అనే అరుపులు, ఈసడింపులు.. చిన్నాపెద్దా మూట అనే తేడా లేకుండా సంఖ్యను బట్టి పది, ఇరవై వసూలు చేయడం అందరు చూస్తూనే ఉంటారు. కనికరం అనే పదమే తెలియని సదరు ఏజెంట్లు, డబ్బులివ్వకపోతే మూటల్ని గుంజడం, తక్కెళ్ళను, బాట్లను, ఎత్తుకుపోవడం రోజువారీ మార్కెట్‌లోని నిత్యకృత్యాలే! ఇవన్నీ రోజువారిగా కూరగాయలమ్మే మార్కెట్ మాత్రమే! పట్టణ ప్రాంతాల్లో రేకుల షెడ్లు, దుకాణాల సముదాయాలు ఉంటాయి. పెద్ద గ్రామ పంచాయితీ స్థాయిలోనేనైతే ఖాళీ స్థలాలుంటాయి. వీటిని కేవలం కూరగాయలు అమ్మేవారే ఉపయోగించుకోవాలి. కానీ ఈ అలవాటు ఎక్కడా కనిపించదు. పట్టణ మున్సిపల్ ప్రాంతాల్లో అయితే దుకాణాలన్నీ బినామీ పేర్లపై ఉంటే షెడ్లన్నీ హోల్‌సేల్ వ్యాపారులే ఆక్రమించుకుం టారు. కూరగాయలే అమ్మాల్సిన ఈ దుకాణ సముదాయాల్లో కిరానా టీకొట్లతోపాటు మాంసాహారాన్ని అమ్మే వాటిగా మారిపోతాయి. రోజు వారిగా అమ్మకానికి వచ్చే రైతులకు స్థలమే దొరకని పరిస్థితి. దాంతో రైతు దళారులకు వారు ఇచ్చేంత ధరకే అమ్మాల్సి వస్తోంది. లేదా అమ్ముకుందామంటే స్థలం లేక ఆ ఇరుకు సందులన్నీ ఇబ్బందికరంగా ఉంటాయి. అయినా వీటన్నింటినీ అధిగమిస్తూ అమ్ముతూ ఉంటారు. ఇక వారాంతపు సంతల్లో కూరగాయలతోపాటు అనేక రకాల వస్తువులు అమ్మకానికి తెస్తుంటారు. దీనికి తోడు పశువుల సంత కొనసాగుతుంది. స్థలం పిడికెడయితే సంత మూరెడులా సాగుతుంది. సందులు, గొందులు, మురికి కాలువలు గట్లు కూడా సరిగా కనిపించవు. ప్రజాధనాన్ని అప్పనంగా తగలేసే నాయకులు విదేశాల్లో కొనసాగుతున్న మంచి విషయాల్ని ఆకళింపు చేసుకున్నట్టు ఏనాడు కనిపించదు. వ్యక్తిగత లబ్ధిని పొందాలనే ఆలోచన తప్ప సామాజిక సంక్షేమాల్ని కాంక్షించని నాయకులున్నంత కాలం ఈ దేశగతి ఇంతే!

## ఢిల్లీలోని టీటీడీ ఆలయంలో గోల్‌మాల్

**- రూ.4 కోట్ల మేర అక్రమాలు**

**- దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు**

న్యూఢిల్లీ, ఆగస్టు24(ఆర్ఎన్ఎ) : దేశ రాజధాని ఢిల్లీలోని టీటీడీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోల్‌మాల్ జరిగిందని ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులపై విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. రూ. 4 కోట్ల మేర అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదుల మేరకు దర్యాప్తు చేస్తున్నారు. రోజువారీ పూజలకు అవసరమైన పూలు, ఇతర వస్తువుల సరఫరా కాంట్రాక్టర్ల నుంచి అధికారులకు ముడుపులు అందాయనీ, అలాగే ప్రత్యేక పూజలు, పర్వదినాల సందర్భంగా చేసే కార్యక్రమాల్లోనూ అవకతవకలు జరిగాయని ఆధారాలతో సహా భక్తుడు టీటీడీకి ఫిర్యాదు చేశారు. దీంతో టిటిడి విజిలెన్స్ అధికారులు ముందుగా విచారణ చేశారు. అయితే ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ జోక్యంతో విచారణ నిలిచిపోయింది. దీంతో ఆ భక్తుడు నేరుగా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో అవకతవకల నిగ్గు తేల్చాల్సిందిగా రాష్ట్రప్రభుత్వం దర్యాప్తు బాధ్యతను విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ కి అప్పగించింది. గత రెండు రోజులుగా విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు ఢిల్లీలోని ఏఈవో కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్నారు.

## రెవెన్యూశాఖ ఎత్తివేతకు ప్రభుత్వం కుట్ర

### కలెక్టర్ల సమావేశంలో సూచాయగా వెల్లడించిన సిఎం కెసిఆర్

**నిజాలు బయటపెట్టాలన్న బిజెపి ప్రతినిధి రఘునందన్ రావు**

హైదరాబాద్,ఆగస్టు24(ఆర్ఎన్ఎ): రెవెన్యూ శాఖన ౹రద్దు చేసేందుకు సిఎంకెసిఆర్ కుట్ర పన్నుతున్నారని బిజెపి మండపడింది. మొత్ంగా ఈ శాఖనుఉంచుతారా లేదాఅన్న అనుమానా లు ఉన్నాయని పేర్కొంద. టీఆర్ఎస్ పార్టీ కొత్తకొత్త నినాదాలతో ప్రజలను మోసం చేస్తోందని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి రఘునందన్ రావు విమర్శించారు. రైతుబంధు రావడం లేదని ప్రజలు వాపోతున్నారని అన్నారు. రెవెన్యూ శాఖ విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. అసలు రెవెన్యూ శాఖను ఉంచాలనుకుంటు న్నారా? తీసేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రెవెన్యూశాఖలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణ లేంటని నిలదీశారు. రెవెన్యూశాఖను ఎత్తివేయాలనే ఆలోచన వెనుక భారీ కుట్ర ఉందని ఆరోపించారు. ధరణి వెబ్‌సైట్ వెనుక చాలా కుట్రలు ఉన్నాయని అన్నారు. కంప్యూటరీకరణ పేరుతో ప్రైవేటు సంస్థలకు బాధ్యతలు అప్పగిస్తే ప్రజలు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఐఎఫ్ఎల్ఎస్ సంస్థకు రెవెన్యూ రికార్డులను అప్పగించడమే పెద్ద మోసం అని పేర్కొన్నారు. రెవెన్యూశాఖను రద్దు చేయనున్నట్లు కలెక్టర్ల సమావేశంలో సీఎం కేసీఆర్ చెప్పినట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఈ విషయం బయటికి వస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్లకు సీఎం వార్నింగ్ ఇచ్చారని అన్నారు. రెవెన్యూశాఖను రద్దు చేయాలనుకునే నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని రఘునందన్ రావు స్పష్టం చేశారు. రెవెన్యూ ఉద్యోగులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని పిలుపునిచ్చారు. భూప్రక్షాళన పేరుతో చేస్తోన్న అక్రమాలను అడ్డుకోవడానికి బీజేపీ చేయబోయే ఉద్యమాలకు మద్దతు ఇవ్వండని కోరారు. అదేవిధంగా కలెక్టర్ల సమావేశంలో ఏం జరిగిందో చెప్పాలని కలెక్టర్లను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బెంగాల్‌లో సీపీఎం నాయకులు తమ కార్యకర్తలతో ప్రభుత్వాన్ని కంట్రోల్ చేసినట్లే.. తెలంగాణలో కూడా చేయాలని చూస్తున్నారని టీఆర్ఎస్ ప్రభుత్వంపై రఘునందన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రజావ్యతిరేకచర్యలను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమన్నారు. దీనిపై గట్టిగానే బిజెపి పోరాడుతుందని అన్నారు.

### కొనసాగుతున్న అల్పపీడనం

హైదరాబాద్,ఆగస్టు24(ఆర్ఎన్ఎ): ఈశాన్య మధ్యప్రదేశ్, దక్షిణ ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్ప పీడన ప్రభావంతో తెలంగాణలో నేడు, రేపు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా కొన్ని రోజులుగా తిరుమలలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. కాగా, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, వాయవ్య బంగాళాఖాతంలో 1.5 కిలోమీటర్ల నుంచి 4.5 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరోవైపు, తెలంగాణ వ్యాప్తంగా నిన్న సాయంత్రం నుంచి రాత్రి వరకు అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది.

# కొత్త భారత్‌ను నిర్మిస్తున్నాం

**- అవినీతి లేని పాలనను సాగిస్తున్నాం**

**- ఈజ్ ఆఫ్ లివింగ్‌లోనూ భారత్‌ది ప్రత్యేకస్థానం**

**- ఫ్రాన్స్ బంధం ఈనాటిది కాదు**

**- కష్టనష్టాల్లో రెండు దేశాలు సహకరించుకుంటున్నాయి**

**- ఉగ్రవాదమైనా, వాతావరణమైనా కలిసి పోరాడుతున్నాం**

**- యునెస్కో కేంద్ర కార్యాలయంలో ప్రధాని మోదీ**

పారిస్, ఆగస్టు24(ఆర్ఎన్ఎ) : భారత్ దేశం అన్ని రంగాల్లో దూసుకెళ్తుందని, కొత్త భారత్‌ను నిర్మిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఉన్న యునెస్కో కేంద్ర కార్యాలయంలో ప్రధాని మోదీ శుక్రవారం భారతీయ సంతతి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. భారత్ అన్ని రంగాల్లో దూసుకువెళ్తోందని, తాము కేవలం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని, కొత్త భారత్‌ను నిర్మిస్తున్నామని అన్నారు. ఫ్రాన్స్ ప్రజలు ఫుట్‌బాల్ ఆటను ఇష్టపడుతారని, ఆ ఆటలో గోల్ ప్రాముఖ్యత అందరికీ తెలుసు అని, గోల్ కొట్టడం అంటే అత్యున్నత లక్ష్యాన్ని చేధించడమే అని, గత అయిదేళ్లలో తమ ప్రభుత్వం అలాంటి లక్ష్యాలనే పెట్టుకుందన్నారు. చేసిన ప్రమాణాలను మరిచే వ్యక్తిని తాను కాదని ఆయన అన్నారు. స్టార్ట్ అప్స్‌లో ఇండియా ముందుకు వెళ్తోందన్నారు. కొత్త దేశాన్ని నిర్మించనున్నామని, దానిలో భాగంగానే అవినీతిని అంతం చేస్తున్నామన్నారు. కుటుంబ రాజకీయాలకు కూడా చెక్ పెట్టామన్నారు. ప్రజాధనాన్ని దోచుకునేవారిని అరికట్టామన్నారు. ఉగ్రవాదాన్ని అడ్డుకున్నామన్నారు. గతంలో ఎన్నుడూ ఇలాంటి చర్యలు గత ప్రభుత్వాలు చేపట్టలేదన్నారు. రెండోసారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 75 రోజుల్లోనే అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. చిన్నారుల సంరక్షణ, హెల్త్‌కేర్ లాంటి అంశాల్లో అనేక చర్యలు చేపట్టామన్నారు. తమ ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా ఎన్నడూ పార్లమెంట్ ఇంత సజావుగా సాగలేదని, గత సెషన్‌లో 75 బిల్లులు పాస్ చేశామన్నారు. చంద్రయాన్2 వ్యోమనౌక త్వరలోనే చంద్రుడిపై ల్యాండ్ అవుతుందన్నారు. అప్పుడు భారత్.. ఎలైట్ దేశాల సరసన నిలుస్తుందన్నారు. భారత్, ఫ్రాన్స్ మధ్య సంబంధాలు మరింత పురోగతి దిశగా సాగుతున్నాయన్నారు. ఉగ్రవాదమైనా.. వాతావరణమైనా.. భారత్, ఫ్రాన్స్ కలిసి పోరాడుతున్నాయన్నారు. ఇండియా, ఫ్రాన్స్ దేశాలు అనేక రంగాల్లో ముందుకు వెళ్తున్నాయని ప్రధాని తెలిపారు.



ఆదిలాబాద్ హరితవనంలో అడ్వెంచర్ పార్క్‌ను ప్రారంభించిన అనంతరం బోటు షికారులో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న తదితరులు

# మానవ మనుగడకు చెట్లే ఆధారం

**- మొక్కలు పెంచి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం**

**- హరిత తెలంగాణెళి సీఎం కేసీఆర్ లక్ష్యం**

**- ప్రతీ ఒక్కరూ హరితహారంలో భాగస్వాములు కావాలి**

**- నాటిన ప్రతీమొక్కను పెంచే బాధ్యత తీసుకోవాలి**

**- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి**

**- హరితవనంలో సాహస క్రీడల పార్క్‌ను ప్రారంభించిన మంత్రి**

అదిలాబాద్, ఆగస్టు24(ఆంఎన్ఎ) : తెలంగాణను హరితవనంగా మార్చడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, ఆమేరకు హరితహార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ హరితవనంలో సాహస క్రీడల పార్క్ (అడ్వేంచర్ స్పోర్ట్స్)ను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... చెట్లు మానవాళికి ఆధారమని, చెట్లు లేనిదే మానవ మనుగడ లేదని, మొక్కలను సమృద్ధిగా పెంచి, ఆరోగ్య కరమైన సమాజాన్ని నిర్మిద్దాం అని తెలిపారు. అడవుల వలన వర్షాలు సకాలంలో కురుస్తాయని తెలిపారు. చెట్లు మానవాళికి ఉపయోగపడే ప్రాణవాయువును ఇచ్చి, మనకు హాని కలిగించే, గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్ వాయువును పీల్చుకుంటాయని తెలిపారు. పర్యావరణ సమతుల్యత ఎంతో ముఖ్యమని, ఇది దెబ్బతినడం మూలంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయని అన్నారు. భూభాగంలో 33శాతం మేర అడువులు, చెట్లు ఉండాలని, కానీ 24 శాతం మేర మాత్రమే ఉన్నట్టు చెప్పారు. హరిత తెలంగాణెళి సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణకు హరితహారం ద్వారా ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని, ప్రతి ఒక్కరూ ఉద్యమంలా చెట్లను నాటి సంరక్షించాలని అన్నారు. నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. నాటిన మొక్కల్లో 85 శాతం మేర కాపాడబడలేకపోతే సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిదులపై చర్యలు తప్పవన్నారు. ఇది ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ఇది ప్రతి ఒక్కరి కార్యక్రమమన్నారు. ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. పచ్చని చెట్లు, బోటింగ్, జంతువులతో ఇప్పటికే సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతున్న మావల హరితవనంలో నేటి నుంచి సాహస క్రీడలు సైతం అందుబాటులోకి వచ్చాయన్నారు. పార్కులో స్కై సైక్లింగ్, జిప్పింగ్, రోవ్ కోర్సులను ఏర్పాటు చేశారన్నారు. జోగు రామన్న, రాథోడ్ బాపురావు, రాథోడ్ జనార్ధన్ తో కలిసి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కాసేపు బోట్ లో విహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఆదిలాబాద్ ఎమ్యెల్యే జోగు రామన్న, వీసీసీఎఫ్ ఆర్.శోభ, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, జడ్పీ చైర్ పర్సన్ రాథోడ్ జనార్ధన్, కలెక్టర్ దివ్య దేవరాజన్, ఎస్పీ విష్ణువారియర్, జిల్లా అటవీ అధికారి ప్రభాకర్, ఎఫ్ డీవో చంద్రశేఖర్, ఎఫ్ఆర్వో అప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విమానయాన సంస్థల ఇంధన బకాయిలు

**పేరుకుపోయిన 4500 కోట్లు**

**ఆయిల్ సరఫార నిలిపేసిన సంస్థలు**

న్యూఢిల్లీ,ఆగస్టు24(ఆర్ఎన్ఎ): ఏడు నెలలుగా రూ. 4500 కోట్ల పాత ఇంధన బకాయిలను చెల్లించక పోవడంతో ఆరు విమానాశ్రయాలలో ఇంధన సరఫరాను నిలిపివేయాలని మూడు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిర్ణయించాయి. కోచ్చి, పుణె, పాటాన, రాంచి, వైజాగ్, మొహాలి విమానాశ్రయాలలో ఎయిర్ ఇండియా విమానాలకు ఇంధనాన్ని గురువారం మధ్యాహ్నం నుంచి నిలిపివేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసి), భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బిపిసిఎల్), హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పిసిఎల్) నిర్ణయించాయి. ఎయిర్ ఇండియాకు 90 రోజుల వరకు రుణ బకాయిలను చెల్లించడానికి వెసులుబాటు ఉంటుందని, ఈ గడువు 200 రోజులు దాటిపోయినా ఎయిర్ ఇండియా ఇప్పటివరకు ఎటువంటి చెల్లింపులు చేయడం లేదని ఒక చమురు సంస్థ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ మూడు చమురు సంస్థలకు కలిపి మొత్తం రూ. 4500 కోట్ల రూపాయల బకాయిలను ఎయిర్ ఇండియా చెల్లించాల్సి ఉందని ఆయన చెప్పారు. అయితే, రూ. 60 కోట్లు చెల్లిస్తామంటూ ఎయిర్ ఇండియా ముందుకొచ్చిందని, కాని ఆ మొత్తం సముద్రంలో నీటి బిందువంత పరిమాణం మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు. వెంటనే బకాయిలను చెల్లించాలని, లేనిపక్షంలో తాము చర్యలు తీసుకోవలసి వస్తుందని ఈ మూడు చమురు సంస్థలు కలిపి ఒక లేఖను వారం రోజుల క్రితమే ఎయిర్ ఇండియాకు రాశాయి. అయితే, బకాయిల చెల్లింపుపై ఎటువంటి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ఎయిర్ ఇండియా తెలియచేయక పోవడంతో తాము ఈ చర్య తీసుకోక తప్పలేదని ఆ అధికారి తెలిపారు. ఎయిర్ ఇండియాకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం ఉంటుందని, కాని చమురు సంస్థలకు ఆ సౌకర్యం లేదని మరో అధికారి చెప్పారు. ఇంధన బకాయిలను చెల్లించడంలో విఫలమైన ఎయిర్ ఇండియాకు దేశవ్యాప్తంగా ఆరు విమానాశ్రయాల్లో ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ సరఫరాను నిలిపి వేసినట్టు ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు వెల్లడించాయి. విశాఖపట్టణం, కొచ్చిన్, మొహాలీ, రాంచి, పుణెళి, పాట్నా ఎయిర్ పోర్టుల్లో ఏఐ విమానాలకు ఇంధనాన్ని ఆపేశామని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. పెండింగ్ బకాయిల మొత్తం భారీగా పెరిగిన నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. కాగా,

ఇంధన నిలిపివేతపై ఎయిర్ ఇండియా ప్రతినిధి స్పందిస్తూ, ఈ కారణంతో తమ సర్వీసులకు ఎటువంటి అవాంతరాలు ఎదురు కాలేదని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థ పనితీరు మెరుగుపడిందని, నిర్వహణ లాభం సాధించే దిశగా వెళుతున్నామని అన్నారు. సంస్థ వాటాల విక్రయం ద్వారా నిధులు లభించకుంటే, రుణ భారాన్ని తగ్గించుకునే పరిస్థితి లేదని అభిప్రాయపడ్డారు.

## మండిపడుతున్న సిద్ధరామయ్య మద్దతుదారులు

బెంగళూరు,ఆగస్టు23(ఆర్ఎన్ఎ): కర్ణాటకలో కాంగ్రెస్ జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడానికి సీఎల్పీ అధ్యక్షుడు, మాజీ సీఎం సిద్ధరామయ్యే కారణమని జేడీఎస్ అధినేత దేవెగౌడ చేసిన ఆరోపణలు ఇప్పుడు కర్నాటక రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. దీనికితోడు దేవేగౌడ సిద్ద రామయ్యను టార్గెట్ చేయడంపై ఆయన మద్దతుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం కుర్చీపై తన కుమారుడు కుమారస్వామి ఉండటం సిద్ధరామయ్యకు ఇష్టం లేదని, ఈక్రమంలో బీజేపీతో లోపాయకారీగా చేతులు కలిపినట్లు ఉందని ఆరోపించారు. దేవెగౌడ గురువారం పార్టీ కార్యాలయంలో నేతల సమావేశంలో మాట్లాడుతూ గత నెలలో తిరుగుబాటు చేసి ముంబై తరలివెళ్లిన ఎమ్మెల్యేలందరూ సిద్ధరామయ్య మద్దతుదారులే అన్నారు. మొత్తం 17 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో సంకీర్ణ ప్రభుత్వం పతనమైందని, సిద్ధరామయ్య వైఖరిని కాంగ్రెస్ నాయకత్వం గమనించాలని కోరారు. సీఎల్పీ నేతగా ఉన్న సిద్ధరామయ్యకు ప్రతిపక్ష నేత పదవి ఇవ్వకూడదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రాంతీయ పార్టీలను అణచివేసేందుకు కుట్ర పన్నుతున్నారనే విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. మైసూరు జిల్లా చాముండేశ్వరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి జేడీఎస్ నేత జీటీ దేవెగౌడ చేతిలో ఓడిపోవడంతో సిద్ధరామయ్య గతం మరువలేదన్నారు. అది తట్టుకోలేక కుమారస్వామి ప్రభుత్వాన్ని దించేందుకు బీజేపీతో కలిసి కుట్ర పన్నినట్లు అనుమానం ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తుమకూరులో తాను ఓడిపోవడానికి కాంగ్రెస్ నేతలే కారణమన్నారు. కేంద్ర మాజీ మంత్రి చిదంబరం అరెస్టు సరికాదన్నారు.

# మూడ్రోజుల నష్టాల నుంచి కోలుకున్న మార్కెట్లు

ముంబయి,ఆగస్టు24(ఆర్ఎన్ఎ): గత మూడు రోజులుగా భారీ నష్టాలతో సతమతమవుతున్న దేశీయ మార్కెట్లు ఎట్టకేలకు శుక్రవారం కాస్త కోలుకున్నాయి. ఉద్దీపన చర్యలతో పాటు సంపన్నులపై సర్‌ఛార్జీని ఎత్తివేస్తూ ప్రభుత్వ ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఆరంభ నష్టాల నుంచి సూచీలు తేరుకున్నాయి. నేటి ట్రేడింగ్‌ను లాభాలతో ముగించాయి. ఆర్థిక మందగమన భయాలు, రూపాయి క్షీణతతో గత కొన్ని రోజులుగా నష్టాల్లో సాగుతున్న సూచీలు శుక్రవారం ఉదయం కూడా కుప్పకూలాయి. ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా పతనమైంది. నిఫ్టీ కూడా 10,700 దిగువన ట్రేడ్ అయ్యింది. అయితే నేటి సాయంత్రం ఆర్థిక మంత్రి ప్రకటన ఉన్నట్లు వార్తలు రావడం మదుపర్లలో కొంత ఉత్సాహాన్ని

## స్వల్ప లాభాలతో ముగింపు

నింపింది. ఫలితంగా మధ్యాహ్నం తర్వాత లోహ, ఆటోమొబైల్, ఫార్మా, ఔషధ, ఐటీ రంగాల్లో కొనుగోళ్లు మొదలయ్యాయి. దీంతో నష్టాల నుంచి తేరుకున్న సూచీలు లాభాల బాట పట్టాయి. మొత్తంగా నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 228 పాయింట్లు ఎగబాకి 36,701 వద్ద, నిఫ్టీ 88 పాయింట్ల లాభంతో 10,829 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 71.66గా కొనసాగుతోంది. ఎన్ఎస్ఈలో వేదాంత, యూపీఎల్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం, యస్ బ్యాంక్, జీ ఎంటర్‌టైన్‌మెంట్స్ షేర్లు లాభపడగా.. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ, ఐషర్ మోటార్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐటీసీ షేర్లు నష్టపోయాయి.

ఆర్థిక మందగమనంపై ఉద్దీపన చర్యలు

ఆర్థిక మందగమనం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులను సంతృప్తి పరిచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం అత్యంత ధనవంతులపై విధించే సర్‌ఛార్జి నుంచి వారికి మినహాయింపు ఇచ్చినట్లు సమాచారం. దీంతో పాటు ఆర్థిక మందగమనం నేపథ్యంలో మరిన్ని ఉద్దీపన చర్యలు తీసుకున్నట్లు సంబంధిత అధికారి ఒకరు వెల్లడించారు. ముఖ్యంగా ఎఫ్‌పీఐ విషయంలో తీసుకున్న నిర్ణయంతో మార్కెట్లు పరుగులు తీస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇటీవలి బడ్జెట్ ప్రసంగంలో రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల మధ్య ఆదాయం ఉన్న వారికి వర్తించే సర్‌ఛార్జిని 15 శాతం నుంచి 25 శాతానికి, రూ.5 కోట్ల పైన పన్ను ఆదాయం ఉన్న వారికి సర్‌ఛార్జిని 15 శాతం నుంచి 37 శాతానికి పెంచుతున్నట్లు ఆర్థికమంత్రి సీతారామన్ ప్రకటించారు. ఈ పరిధిలోకి ఎఫ్‌పీఐలు కూడా రావడంతో.. బడ్జెట్ అనంతరం విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలకు పాల్పడ్డారు. ఫలితంగా జూన్ నుంచి ఇప్పటి వరకు 10 శాతం అంటే సుమారు 3 బిలియన్ డాలర్ల మేర షేర్లను అమ్ముకున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లకు ఊరట కల్పించేందుకు గత కొన్ని రోజులుగా దీనిపై పలు దఫాలుగా సమావేశం నిర్వహించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



ములుగు జిల్లా జాకారం మినీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో సరదాగా కబడ్డీ ఆడిన ఎమ్మెల్యే సీతక్క

# పిల్లలతో కబడ్డీ ఆడిన సీతక్క

వరంగల్,ఆగస్టు24 (నేటినిజం ప్రతినిధి): సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేసే ములుగు ఎమ్మెల్యే సీతక్క తాజాగా కబడ్డీ ఆడారు. ములుగు మండలం జాకారంలోని బాలికల మినీ గురుకుల పాఠశాలలో శుక్రవారం 'ఎంటర్‌టైన్‌మెంట్ డే' వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి సరదాగా కబడ్డీ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టుదలతో విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఆకాక్షించారు. చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని అన్నారు. ఇక ఎమ్మెల్యే కబడ్డీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# వర్గీకరణకు బిజెపి మద్దతు: మందకృష్ణ

భద్రాద్రి,ఆగస్టు24 (ఆంఎన్ఎ): ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ అన్ని రాజకీయ పార్టీల కంటే ముందు తీర్మానం, మేనిఫెస్టోలో పెట్టింది బీజేపీనేనని మందకృష్ణ మాదిగ అన్నారు. బీజేపీకి కేంద్రంలో సంపూర్ణ మద్దతు ఉండి కూడా ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడంలో తీవ్ర నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కేంద్రంతో తాడోపేడో తేల్చుకోవడానికి జాతీయ స్థాయిలో ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రకటించారు.

# జెట్ ఎయిర్‌వేస్ కార్యాలయంలో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ, ఆగస్టు24(ఆర్ఎన్ఎ) : విదేశీ మారకద్రవ్య చట్ట (ఫెమా) ఉల్లంఘనల ఆరోపణలపై జెట్ ఎయిర్‌వేస్ ఫౌండర్ నరేష్ గోయల్ నివాసం, కార్యాలయాలపై ఈడీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఫెమా నిబంధనలకు అనుగుణంగా అదనపు ఆధారాల కోసం ఈ సోదాలు చేపట్టామని ఈడీ అధికారులు వెల్లడించారు. ముంబై, ఢిల్లీలో గోయల్‌కు చెందిన నివాస, కార్యాలయ ప్రాంగణాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఆర్థిక సంక్షోభంతో పాటు నగదు కొరతతో ఏప్రిల్ 17న జెట్ ఎయిర్‌వేస్ సేవలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. మరోవైపు జెట్ ఎయిర్‌వేస్‌లో పెద్ద ఎత్తున నిధుల దారిమళ్లింపు సహా పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తనిఖీ నివేదికలోనూ వెల్లడైంది. జెట్ ఎయిర్‌వేస్‌లో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో ఎయిర్‌లైన్ చైర్మన్‌గా నరేష్ గోయల్ ఈ ఏడాది మార్చిలో వైదొలిగారు. ప్రస్తుతం జెట్ ఎయిర్‌వేస్‌లో ఐబీసీ కోడ్ కింద దివాళా ప్రక్రియ సాగుతోంది.

# పారదర్శకంగా విద్యుత్ ఒప్పందాలు

## - విద్యుత్ ఉద్యోగుల పనితీరుపై అవాస్తవాలు ప్రచారం చేయొద్దు
## - అనుమానాలుంటే సీబీఐ విచారణకు మేం సిద్ధం
## - ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్‌రావు

హైదరాబాద్, ఆగస్టు24(ఆర్ఎన్ఎ) : విద్యుత్ కొనుగోళ్లు, ఒప్పందాలను పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికైనా అనుమానాలు ఉంటే సీబీఐ విచారణకు మేం సిద్ధంగా ఉన్నామని ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్‌రావు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అవగాహన లేక విద్యుత్ సంస్థలపై ఆరోపణలు చేశారని అన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని లక్ష్మణ్ చేసిన ఆరోపణలను ఖండించారు. విద్యుత్ కొనుగోళ్లు, ఒప్పందాలపై ప్రభాకర్‌రావు వివరణ ఇచ్చారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో కేవలం 71 మెగావాట్ల సోలార్ పవర్ ఉండేదని.. ఈరోజు 3,600 మెగావాట్లకుపైగా సోలార్ పవర్ అందుబాటులో ఉందని ప్రభాకర్‌రావు తెలిపారు. రాష్ట్రం అవలంబిస్తున్న డిస్ట్రిబ్యూటెడ్ మోడల్‌ని దేశం మొత్తం ప్రశంసించిందని ఆయన గుర్తు చేశారు. అయితే రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఒక్క మెగావాట్ కూడా ఉత్పత్తి చేయలేదని పలువురు మాట్లాడడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. రాష్ట్రం ఏర్పడేనాటికి 7,775 మెగావాట్లుగా ఉన్న స్థాపిత శక్తి ఇప్పుడు 16,203 మెగావాట్లకు చేరిందని ఆయన వెల్లడించారు. ఎంతో పారదర్శకంగా విద్యుత్ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని అన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రూ.3.90పైసలకు విద్యుత్‌ను కొంటున్నామని, రూ.4.30 పైసలకు విద్యుత్ సరఫరా చేస్తామని ఎన్టీపీసీ ఎప్పుడూ చెప్పలేదని తెలిపారు. 800 మెగావాట్ల ప్లాంట్‌ను దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు సందర్శించారని, విద్యుత్ సంస్థలు పూర్తి స్వతంత్రమైనవన్నారు. మాపై ఎలాంటి ప్రలోభాలు ఒత్తిళ్లు లేవని, మేం ఎటువంటి ఒత్తిడులకు లొంగడం లేదన్నారు. రాత్రికిరాత్రే పీపీఏలు కుదుర్చుకున్నారనడం అవాస్తవమని ప్రభాకర్‌రావు తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల పనితీరుపై అవాస్తవాలు ప్రచారం చేయొద్దని, మా పనితీరుపై అనుమానాలుంటే సీబీఐ విచారణకు కూడా మేము సిద్ధమని ప్రభాకర్‌రావు పేర్కొన్నారు.

# సహాయక చర్యలకు వెళుతూ కుప్పకూలిన హెలికాప్టర్

హైదరాబాద్,ఆగస్టు24 (ఆర్ఎన్ఎ): ఉత్తరాఖండ్‌లో ఇవాళ ఓ హెలికాప్టర్ కూలింది. సహాయక సామాగ్రి మోసుకువెళుతున్న ఆ హెలికాప్టర్ టికోచి ఏరియాలో నేలకూలింది. ఆ హెలికాప్టర్‌లో ఉన్న పైలట్‌తో సహా కోపైలట్ స్వల్ప గాయాలకు గురయ్యారు. హిమాచల్‌ప్రదేశ్‌లో మరో దుర్ఘటన చోటుచేసుకుంది. షిమ్లా సమీపంలో మిలిటరీ వాహనం ఒకటి రోడ్డుపై స్కిడ్ అయ్యింది. ఈ ఘటనలో ఓ ఆర్మీ జవాను మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. గాలు నుంచి లంబీదార్ మధ్య ఈ ప్రమాదం జరిగింది.

# హరితహారం మొక్కల్ని తినేసిన మేకలు

## - యాజమానికి రూ.500 ఫైన్‌విధించిన పంచాయతీ కార్యదర్శి

వికారాబాద్, ఆగస్టు24(ఆర్ఎన్ఎ) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని ప్రతీ సంవత్సం కొనసాగిస్తోంది. దీంట్లో భాగంగా నర్సరీలను ఏర్పాటు చేసి పలు జాతుల మొక్కల్ని పెంచుతున్నారు. కోట్లాది మొక్కల్ని పెంచుతూ పలువురికి ఉపాధిని కల్పిస్తున్నారు. ఇదిలా ఉంటే హరితహారం కోసం నర్సరీల్లో మొక్కల్ని మేకలు తినేశాయి. దీంతో సదరు మేకల యజమానికి అధికారులు జరిమానా విధించారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పరిధిలోని చిలుకూరులో జరిగింది. హరితహారంకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నర్సరీల్లో మొక్కలను విరివిగా పెంచుతున్నారు. ఈ క్రమంలో చిలుకూరు దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన నర్సరీలోకి మేకలు ప్రవేశించి ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు పచ్చగా నిగనిగలాడుతున్న మొక్కల్ని మేకలు మేసేశాయి. అక్కడున్న మొక్కలన్నింటినీ తినేశాయి. దీంతో మేకల యజమానికి చిలుకూరు పంచాయతీ కార్యదర్శి రూ. 500 జరిమానా విధించి వసూలు చేశారు.

# బంగర్ కొంపముంచిన నాలుగో స్థానం

## ఎంపికలో అదే ప్రధాన అడ్డంకి అని ప్రచారం

ముంబై,ఆగస్టు24 (ఆర్ఎన్ఎ): టీమిండియా కోచింగ్ స్టాఫ్ ఎంపికలో దాదాపు అందరూ ఊహించినట్టుగానే ఫలితాలు వచ్చాయి. మొదటి నుండీ ప్రధాన కోచ్ గా రవిశాస్త్రి పేరు ఖరారైనట్టే వినిపించగా... చివరికి కపిల్ సారథ్యంలోని కమిటీ అతనికే ఓటు వేసింది. తాజాగా ఎంఎస్ కె ప్రసాద్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సహాయక సిబ్బంది విషయంలోనూ అందరి అంచనాలకు తగ్గట్టుగానే వ్యవహరించింది. అయితే సంజయ్ బంగర్ పై వేటు పడుతుందని చాలా మంది ముందుగానే అభిప్రాయాని కొచ్చేసినా... ఇంటర్వ్యూలో ఈ బ్యాటింగ్ కోచ్ ను తమ ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసినట్టు తెలుస్తోంది. దాదాపు గంటకు పైగా జరిగిన ముఖాముఖి ఇంటర్వ్యూలో ప్రసాద్ అండ్ కో పలు ప్రశ్నలు సంధించింది. దీనిలో ప్రధానమైంది ప్రపంచకప్ వైఫల్యమే. ప్రపంచకప్ లాంటి పెద్ద టోర్నీకి దాదాపు ఏడాది ముందే నాలుగో స్థానంలో ఆటగాడిని గుర్తించకపోవడాన్ని కమిటీ ప్రశ్నించింది. అలాగే సెమీఫైనల్లో ధోనీని ఏడో స్థానంలో పంపడం పైనా కమిటీ గుచ్చిగుచ్చి ప్రశ్నించడంతో బంగర్ నీళ్ళు నమిలినట్టు తెలుస్తోంది. సెమీస్ లో ధోనీని బ్యాటింగ్ ఆర్డర్ లో ముందు పంపించి ఉంటే ఫలితం వేరేలా ఉండేదని చాలా మంది మాజీలు, విశ్లేషకులు స్పష్టంగా చెప్పిన నేపథ్యంలో బ్యాటింగ్ కోచ్ గా ఎందుకు దీనిపై తప్పుడు నిర్ణయం తీసుకున్నారో చెప్పాలని అడిగింది. ధోనీ లాంటి అనుభవం ఉన్న ఆటగాడిని చివరి వరకూ బ్యాటింగ్ కు పంపకుండా ఉండేందుకు కారణమేంటనేది బంగర్ సరిగ్గా చెప్పలేకపోయినట్టు సమాచారం. ఇదిలా ఉంటే గత ఏడాది కేప్‌టౌన్ వేదికగా జరిగిన మ్యాచ్ లో 208 పరుగుల టార్గెట్ ను ఛేదించలేకపోవడం, ఇంగ్లాండ్ చేతిలో 31 పరుగుల తేడాతో ఓడిన టెస్టులో పుజారాను ఆడించకపోవడం వంటి ప్రశ్నలకు బంగర్ సరైన సమాధానివ్వలేదని బోర్డు వర్గాలు తెలిపాయి. దీంతో బంగర్ పై వేటు వేసిన సెలక్షన్ కమిటీ కొత్త బ్యాటింగ్ కోచ్ గా విక్రమ్ రాథోడ్ ను ఎంపిక చేసింది. అలాగే అంతా ఊహించినట్లే బౌలింగ్ కోచ్‌గా భరత్ రుణ్, ఫీల్డింగ్ కోచ్‌గా ఆర్.శ్రీధర్‌లను కొనసాగించాలని నిర్ణయించింది. సహాయక కోచ్‌ల ఎంపికలో ఎవరి జోక్యం ఉండదని ముందుగానే బీసీసీఐ స్పష్టం చేసింది. దీంతో ప్రధాన కోచ్ గా మళ్లీ ఎంపికైన రవిశాస్త్రికి అత్యంత సన్నిహితుడుగా ఉన్న బంగర్ కొనసాగింపునకు బోర్డు సుముఖంగా లేదు. దీనికి ప్రధాన కారణం ప్రపంచకప్ వైఫల్యంలో ప్రధానంగా నాలుగో స్థానంలో ఆటగాడిని రెండేళ్ళు సమయమున్నా గుర్తించకపోవడం మరో కారణంగా భావిస్తున్నారు.

## తమిళనాడు సిఎంతో టిటిడి ఛైర్మన్ భేటీ

చెన్నయ్,ఆగస్టు24 (ఆర్ఎన్ఎ): తమిళనాడు సిఎం పళనిస్వామితో టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. తిరుమలలో చేపడుతున్నసేవా కార్యక్రమాల గురించి ఆయన పళనిస్వామికి వివరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుమలలో పలు సంస్కరణలు చేపడుతున్నట్టు సుబ్బారెడ్డి తెలిపారు. అన్ని ప్రాంతాల భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని టిటిడి విధివిధానాలను రూపొందించిందని ఆయన పళనిస్వామికి చెప్పారు. భక్తులకు మరింత సులభంగా స్వామివారి దర్శనం కల్పించేందుకు సిఎం పళనిస్వామి పలు సూచనలు చేశారు. టిటిడి అభివృద్ధిపై వీరిద్దరు గంట పాటు చర్చించారు. పళనిస్వామిని కలిసిన నేపథ్యంలో సుబ్బారెడ్డి ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందించి, శాలువాతో సత్కరించారు.

# నాడాకు వాడా భారీ షాక్

## ఆరు నెలలు గుర్తింపు రద్దు

న్యూఢిల్లీ,ఆగస్టు24 (ఆర్ఎన్ఎ): టోక్యో ఒలింపిక్స్ కు ముందు భారత నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీకి షాక్ తగిలింది. నాడా గుర్తింపును ఆరు నెలల పాట రద్దు చేస్తూ వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ నిర్ణయం తీసుకుంది. నాడా ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా లేకపోవడంతో దీనికి కారణమని వాడా ప్రకటించింది. ఇటీవల చేపట్టిన తనిఖీల్లో ఇది వెల్లడైందని, స్వతంత్ర కమిటీ నివేదికల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వాడా వెల్లడించింది. ఒలింపిక్స్‌కు మరో ఏడాది మాత్రమే సమయమున్న నేపథ్యంలో ఈ నిర్ణయం భారత క్రీడా వర్గాల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. అయితే గుర్తింపు రద్దయినప్పటకీ... డోప్ పరీక్షలు నిర్వహించేందుకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని తెలుస్తోంది.

సేకరించిన నమునాలను మాత్రం ఇతర దేశాల్లోనే గుర్తింపు పొందిన ల్యాబ్ లలో చేయించాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే వాడా సూచనల మేరకు ఎన్‌డీటీఎల్‌ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దితే.. నిషేధ కాలం పూర్తయ్యేలోపు మరోసారి గుర్తింపునకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించడం ఊరటగా చెప్పొచ్చు. కాగా వాడా నిర్ణయంతో నాడా బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. ఒలింపిక్స్‌కి ఇంకా ఏడాది మాత్రమే సమయం ఉన్న తరుణంలో బడ్జెట్ ఎంతో కీలకమన్నారు. అటు బీసీసీఐకి సైతం కష్టకాలం ఎదురుకానుంది. భారత్‌లో గుర్తింపు పొందిన ఏకైక ల్యాబ్ ఎన్‌డీటీఎల్ కావడంతో బీసీసీఐ కూడా తమ నమూనాలను ఇక్కడికే పంపించి పరీకలు చేయించేది. మరోవైపు వాడా తీసుకున్న రద్దు నిర్ణయంపై భారత ఒలింపిక్ సంఘం తీవ్రంగా స్పందించింది. తప్పంతా నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీదేనని విమర్శించింది. నాడా చేసిన పొరపాటుకు ఇతరులు డబ్బులు ఎందుకు చెల్లించాలని ఘాటుగా ప్రశ్నించింది. రూపాయలతో పోయే దాన్ని డాలర్లకు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

# శ్రీనగర్‌లో మళ్లీ ఆంక్షలు

శ్రీనగర్ , ఆగస్టు24 (ఆర్ఎన్ఎ) : జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో శుక్రవారం మరోసారి ఆంక్షలు విధించారు. అధికరణ 370 రద్దుకి వ్యతిరేకంగా కొన్ని వేర్పాటువాద సంస్థలు నిరసనకు పిలుపునివ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గురువారం రాత్రి నగరంలో పలుచోట్ల పోస్టర్లు వెలిశాయి. ఈ నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. దీంతో ఎక్కడికక్కడ బారికేడ్లు, ముళ్ల కంచెలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రదర్శనకు ఎలాంటి అనుమతులు లేవని.. ప్రజలు సమూహాలుగా తిరగొద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. కశ్మీర్‌పై కేంద్రం నిర్ణయం తరువాత రాష్ట్రవ్యాప్తంగా విధించిన ఆంక్షల్ని ఈ వారమే దశలవారీగా తొలిగించిన విషయం తెలిసిందే. ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్రంలోని ప్రముఖ నేతల్ని ఇంకా నిర్బంధంలోనే ఉంచారు. కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే అధికరణ 370 రద్దుతో పాటు, రాష్ట్రాన్ని విభజిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా భారీగా బలగాలను మొహరించి కఠిన ఆంక్షల్ని విధించారు. పరిస్థితి మెరుగుపడుతున్న కొద్దీ వాటిని తొలగిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే శ్రీనగర్, కశ్మీర్‌లోని ఇతర ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ఆంక్షల్ని ఎత్తివేస్తూ వస్తున్నారు. అందులో భాగంగా ఈవారం అనేక ప్రాంతాల్లో విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు తెరచుకొన్నాయి. కానీ, నిరసన ప్రదర్శనలకు వేర్పాటువాద సంస్థల తాజా పిలుపుతో మరోసారి ఆంక్షల్ని విధించాల్సి వచ్చింది.




ఏపీ వార్తలు

# వరద ప్రకృతి వైపరీత్యం కాదు..

- కావాలనే సృష్టించారు
- రాజధానిని ముంచాలని కుట్రలు చేశారు
- మూడురోజులు సాగర్‌లో నీటిని నిలిపి ఒకేసారి వదిలారు
- తెలంగాణతో మంచి సంబంధాలున్నాయని జగన్ చెబుతున్నాడు
- వృధానీటిని పోతిరెడ్డిపాడుకు మళ్లిస్తే తెలంగాణ కృష్ణా వాటర్ బోర్డుకు ఎందుకు ఫిర్యాదు చేశారు?
- వైకాపా ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డ టీడీపీ అధినేత జగన్
- కృష్ణానది వరదలపై ప్రజంటేషన్ ఇచ్చిన చంద్రబాబు

అమరావతి, ఆగస్టు24(ఆర్ఎన్ఎ) : రాజధాని అమరావతిని ముంచడానికి వరదను తీసుకొచ్చారని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. గుంటూరు టీడీపీ ఆఫీసులో కృష్ణా నది వరదలపై శుక్రవారం చంద్రబాబు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద ప్రకృతి వైపరీత్యం కాదని.. ప్రభుత్వ వైఫల్యంతోనే వరదలు వచ్చాయన్నారు. మూడు రోజులు సాగర్‌లో నీటిని నిలిపి ఒక్కసారిగా వదిలారని.. మూడు టీఎంసీలు ఉండే ప్రకాశం బ్యారేజీలో 4 టీఎంసీలు ఉంచారన్నారు. రాజధానిని ముంచాలనే ప్రభుత్వం కుట్రని.. కృష్ణా నదికి వరదలేమీ కొత్తకాదన్నారు. ఫ్లడ్ మేనేజ్‌మెంట్ ప్రభుత్వానికి చేతకాలేదని.. ఐదారు లక్షల క్యూసెక్కుల నీటిని మేనేజ్ చేయడం పెద్ద కష్టం కాదన్నారు. ఉద్దేశపూర్వకంగానే వరదల్ని తీసుకొచ్చారని.. లంక, పంటల్ని ముంచేశారని మండిపడ్డారు. ప్రకాశం బ్యారేజీలో నీళ్లు తన నివాసం దగ్గరకు రావాలనే కుట్ర పన్నారని చంద్రబాబు ఆరోపించారు. తర్వాత మళ్లీ నోటీసుల పేరుతో డ్రామాలాడారని మండిపడ్డారు. కరకట్టపై ఏ కట్టడానికి నోటీసులు ఇవ్వకుండా కేవలం తన ఇంటికి మాత్రం నోటీసులు ఇచ్చారన్నారు. తర్వాత అనుమతి లేకుండా ఇంటిపైకి డ్రోన్ కెమెరా పంపారని మండిపడ్డారు. తాను ఉంటున్న ఇంటిని ముంచడం కోసం.. కృష్ణా పరివాహక లంక గ్రామాలన్నింటినీ ముంచారని ఆరోపించారు. వరదలు వచ్చే సమయానికి రాష్ట్రంలో ప్రాజెక్టులన్నీ ఖాళీగా ఉన్నా.. వరదల్ని నియంత్రించే అవకాశమున్నా ఫ్లడ్ మేనేజ్‌మెంట్ చేయలేకపోయారని ఆరోపించారు. తన ఇంటిని ముంచే కుట్రతో ప్రజలను నిండా ముంచారన్నారు చంద్రబాబు. రాజధానిని వరద నీటితో ముంచాలని వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించిందని.. వరదలు వచ్చాయని రాజధానిని మారుస్తారా అంటూ ప్రశ్నించారు. ఈ వరదలతో మొత్తం 53 వేల ఎకరాల భూమి వరద ముంపునకు గురైందని.. రైతులకు పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వరద బాధితులకు నెలకు సరిపడా రేషన్ సరకులు, దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వాలన్నారు. జగన్ ప్రభుత్వం తెలంగాణతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని చెబుతోందని, మరి సముద్రంలో వృధాగా పోయే నీళ్లను పోతిరెడ్డి పాడుకు మళ్లిస్తే తెలంగాణ కృష్ణా వాటర్ బోర్డుకు ఎందుకు ఫిర్యాదు చేసిందని ప్రశ్నించారు చంద్రబాబు. తెలంగాణ ఫిర్యాదు సంగతి వైసీపీ సర్కార్ తెలియదా.. దీనిపై ఏం సమాధానం చెబుతారన్నారు. ఇక అవినీతి పేరు చెబుతూ ప్రాజెక్టుల్ని ఆపేస్తారా అంటూ ప్రశ్నించారు చంద్రబాబు. కియా కార్ల పరిశ్రమల వల్ల రూ.20వేల కోట్ల భారం అనడం దారుణమని.. ఇంసెంటివ్ లేకుండా పరిశ్రమలు పెడతారా అంటూ ప్రశ్నించారు.

## వోక్స్ వ్యాగన్ కేసులో..

# బొత్సకు సీబీఐ కోర్టు నోటీసులు

- వైఎస్ హయాంలో తెరపైకి కేసు
- అప్పటి పరిశ్రమల మంత్రిగా బొత్స
- విశాఖలో పరిశ్రమ ఏర్పాటుకు వచ్చిన వోక్స్ వ్యాగన్

అమరావతి, ఆగస్టు24(ఆర్ఎన్ఎ) : వోక్స్ వ్యాగన్ కేసులో ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణకు శుక్రవారం హైదరాబాద్ సీబీఐ కోర్టు సమన్లు పంపింది. సెప్టెంబర్ 12న కోర్టుకు హాజరుకావాలని సమన్లలో పేర్కొంది. వోక్స్ వ్యాగన్ కేసులో బొత్స సత్యనారాయణ సాక్షిగా ఉండటంతో ఈ నోటీసులు పంపారు. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో వోక్స్ వ్యాగన్ వ్యవహారం తెరపైకి వచ్చింది. అప్పుడు బొత్స సత్యనారాయణ భారీ పరిశ్రమలశాఖ మంత్రిగా ఉన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వోక్స్ వ్యాగన్ సంస్థ విస్తరణ పేరుతో విశాఖలో కార్ల కంపెనీ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బొత్స సత్యనారాయణ భారీ పరిశ్రమల మంత్రిగా ఉన్న సమయంలో జర్మనీకి చెందిన వోక్స్ వ్యాగన్ సంస్థ మధ్యవర్తిగా ఉన్న వశిష్ట వాహన్ అనే కంపెనీ రూ.11 కోట్లు చెల్లించారు. అయితే వశిష్ట వాహన్‌తో తమకు సబంధం లేదని వోక్స్ వ్యాగన్ ప్రకటించడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అవకాశాన్ని ఆసరా చేసుకున్న వోక్స్ వ్యాగన్ కంపెనీ బోర్డు సభ్యుడు హెల్మత్ షుష్టర్ ప్రభుత్వంతో చర్చలు జరిపి వాటాగా రూ.11.60 కోట్లు చెల్లించాలని ప్రతిపాదించారు. వోక్స్ వ్యాగన్‌కు ఇండియాలో అనుబంధ సంస్థగా ఉన్న వశిష్ట వాహన్ సంస్థ పేరు మీద రూ.11.60 కోట్లను విడుదల చేయించారు. డబ్బులు వశిష్ట వాహన్ ఖాతాలో పడగానే ఆ డబ్బులు డ్రా చేసుకొని షుష్టర్ పరారయ్యాడు. ఈ విషయంలో అప్పటి నాటి భారీ పరిశ్రమల మంత్రి బొత్స సత్యనారాయణపై ఆరోపణలు రావడంతో సీబీఐ దర్యాప్తునకు వైఎస్ ఆదేశించారు. బొత్సకు ఎలాంటి సంబంధంలేదని సీబీఐ విచారణ జరిపి తేల్చింది.

## ఆర్టీసీ బస్సు టికెట్లపై..

# అన్యమత ప్రకటనలు

- తిరుపతిలో బీజేపీ కార్యకర్తల ఆందోళన

తిరుపతి, ఆగస్టు24(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ బస్సు టికెట్లపై అన్యమత ప్రకటనలను నిరసిస్తూ భాజపా కార్యకర్తలు, నాయకులు ఆందోళనకు దిగారు. శుక్రవారం తిరుపతి ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆర్టీ అధికారులకు వ్యతిరేకంగా బీజేపీ శ్రేణులు నినాదాలు చేశారు. హిందువుల మనోభావాలను కాపాడాలంటూ నినాదాలు చేశారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన క్షేత్రంలో ఇలా ఇతర మతాలకు సంబంధించిన ప్రచారంపై భక్తులు భగ్గుమంటున్నారు. రాంభగీచ బస్టాండ్‌లోని కౌంటర్‌లో గురువారం ఉదయం నుంచి ఇచ్చిన టిక్కెట్ల వెనుక భాగంలో హజ్, జేరుసలేం యాత్రల ప్రకటనలు ముద్రించి ఉన్నాయి. టిక్కెట్ల వెనుక భాగంలోని ప్రకటన చూసి అవాక్కయిన కొందరు భక్తులు ఆర్టీసీ అధికారులను ప్రశ్నించారు. అయితే తిరుమలకు వచ్చే టిక్కెట్ రోల్‌పై ఎలాంటి ప్రకటనలు ఉండవని చెప్పిన ఆర్టీటీ డిపో మేనేజర్.. ప్రకటనలు ఉన్న ఐదు పేపర్లు పొరపాటున తిరుమలకు వచ్చాయని చెప్పారు. ఇదే విషయమై టీటీడీ మాజీ సభ్యుడు ఏవీ రమణ ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. బస్సు టిక్కెట్ వెనుక అన్యమత యాత్రల గురించి ప్రచారం చేయడం ఘోరమని అన్నారు. టీటీడీకి కొత్త ఛైర్మన్‌ను నియమించినప్పుడే భక్తులు ఆందోళన చెందారని, ఇప్పుడు వారి భయమే నిజమైందని విమర్శించారు. ఆలయ పవిత్రత, మనోభావాలను కాపాడాల్సిన వారే బాధ్యతారాహిత్యంగా ఉంటే ఎలా? అని రమణ ప్రశ్నించారు. ఇదిలా ఉంటే శుక్రవారం తెలంగాణ భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిరుపతిలో బస్‌టికెట్ వెనుక జెరూసలెం గురించి ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి జగన్‌కు తెలుసా? అని ప్రశ్నించారు. ఈ పద్ధతిని వెంటనే రద్దు చేయాలని, ఇలాంటి నిర్ణయాలు తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం విషయంలో స్పందించినట్లే ఇక్కడ కూడా సీఎం స్పందించాలని కోరారు. అనంతరం భాజపా నేతలు తిరుపతి ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా భాజపా నేత భానుప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని అన్నారు. అన్యమత ప్రచారానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుట్రలో భాగంగానే తిరుమలలో అన్యమత ప్రచారం జరుగుతోందని, బాధ్యులైన వారిని భక్తుల ముందు నిలబెట్టాలని ఆయన అన్నారు. అన్యమత ప్రచారాన్ని అడ్డుకునేలా గతంలోనూ ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. ఇలాంటి ప్రచారాలు ఆగకపోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

## చంద్రబాబు వ్యాఖ్యలు దారుణం

బినామీల పేరుతో భూములు సంపాదించాడు

మండిపడ్డ విజయసాయి

అమరావతి,ఆగస్టు24(ఆర్ఎన్ఎ): టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపై వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి ట్విటర్ వేదికగా మండిపడ్డారు. కొద్ది రోజులుగా వరదలు, రాజధాని అమరావతి తరలింపు ఊహాగానాలపై టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై విజయ సాయిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అమరావతి నుంచి రాజధానిని తరలించేందుకే ముంపుకు గురిచేశారని గగ్గోలు పెడుతున్నవారెవరో గమనించారా? చంద్రబాబు, సుజనా, కేశినేని, సీఎం రమేశ్, లోకేశ్, కోడెల, ఉమ, వీళ్ల బినామీలు, కావాల్సిన వాళ్లు వేల ఎకరాల భూములు రైతులను మోసం చేసి కొన్నారు. రియల్ ఎస్టేట్ ధరలు పడిపోతాయన్నదే వీరి ఏడుపు. కొంచెం ఆలస్యమైనా కుట్రలు, దోపిడీలు చేసిన వారి పాపం పండుతుంది. చిదంబరం 20సార్లు ముందస్తు బెయిలుతో అరెస్టు నుంచి తప్పించుకున్నా చివరకు కటకటాల పాలుకాక తప్పలేదు. 18 అవినీతి కేసుల్లో స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు పరిస్థితి కూడా అంతే. వ్యవస్థలను మ్యానేజి చేయడం మునుపటంత సులువు కాదిప్పుడు. గతంలో సోము వీర్రాజును రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కాకుండా అడ్డుకున్నాడు చంద్రబాబు. ఇప్పుడు కన్నాను కదిలించి తన విధేయుడిని అధ్యక్షుడిగా నియమించేందుకు సుజనా, సీఎం రమేశ్ ల ద్వారా లాబీయింగ్ చేస్తున్నాడు. ఢిల్లీలో పరిణామాల్ని వీళ్లిద్దరు ఎప్పటికప్పుడు తమ బాస్ కు బ్రీఫ్ చేస్తుంటారు. అని విజయ సాయిరెడ్డి వ్యాఖ్యానించారు.

## పోలవరంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు: రామకృష్ణ

విజయవాడ,ఆగస్టు24 (ఆంఎన్ఎ): పోలవరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సీపీఐ రాష్ట్రప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. ఏపీ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి ఐదేళ్లు పాడుతుందని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ.. పోలవరం టెండర్ల ఎందుకు రద్దు చేశారో తెలియడం లేదని, ఏకపక్షంగా నవయుగ ఇంజినీరింగ్ సంస్థ టెండర్లను రద్దు చేసేశారని ఆయన మండిపడ్డారు. అమరావతి విషయంలో ప్రభుత్వం గందరగోళంలో ఉందని అన్నారు. అమరావతిపై సాక్షాత్తూ మంత్రే దుష్ప్రచారం ప్రారంభించారని చెప్పారు. ఇలాంటి చర్యలు తిరోగమన దిశగా చూడాల్సి ఉంటుందన్నారు. ఏపిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుని పోతామని ప్రకటించి ఇలా అభివృద్ధి నిరోధకచర్యలకు పూనుకోవడం తగదన్నారు.

## తిరుమలలో పెరిగిన రద్దీ

తిరుపతి, ఆగస్టు 24 (ఆర్ఎన్ఎ): తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు స్వామివారి సర్వదర్శనం కోసం తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్ లోని 22 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 12 గంటలు పట్టే అవకాశముంది. శీఘ్ర సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం (ఆన్ లైన్ రూ.300/-), దివ్యదర్శనం (కాలినడకన) వారికి శ్రీవారి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టవచ్చు. నిన్న 34,584 మంది భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న స్వామివారికి హుండీలో భక్తులు సమర్పించిన నగదు రూ. 3.43 కోట్లు.

## బస్సు దూసుకుపోయి కాలు కోల్పోయిన బాలిక

యాదాద్రి,ఆగస్టు24 (ఆంఎన్ఎ):ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురై.. ఓ విద్యార్థిని కాలు కోల్పోయిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో చోటుచేసుకుంది. కొయ్యలగూడెం బస్టాప్ వద్ద బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా.. కీర్తి అనే విద్యార్థిని బస్సు టైరు కింద పడిపోయింది. దీంతో ఆమె కాలు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో మరో విద్యార్థినికి కూడా గాయలయ్యాయి. గాయపడ్డ వారిద్దరిని చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కీర్తిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. బస్సు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

## వెంకటయ్య కుటుంబానికి పరామర్శ

కడప,ఆగస్టు24(ఆర్ఎన్ఎ): కలసపాడు మండలంలోని చింతలపల్లిలో శుక్రవారం భాజపా నేత, మాజీ ఎమ్మెల్యే జయరాములు పర్యటించారు. ఇటీవల మృతిచెందిన మాజీ సహకార సంఘం డైరెక్టర్ చిన్నవెంకటయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నవెంకటయ్య భార్య రామసుబ్బమ్మ, కుమారుడు తెదేపా నేత, మాజీ మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ రంతుతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా కార్యదర్శి పందరి, నాయకులు రామకృష్ణారెడ్డి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి

- బస్సు టికెట్‌లపై ప్రచారంకోసం జీవో ఇచ్చింది బాబే
- తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధంలేదు
- లక్ష్మీనారాయణ బాబు ట్రాప్‌లో పడుతున్నాడు
- వైసీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అమరావతి, ఆగస్టు24(ఆర్ఎన్ఎ) : రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా చంద్రబాబు హయాంలోనే హిందూ మతానికి అవమానం జరిగిందని వైసీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచి పనులతో తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదనే భయంతో టీడీపీ, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా, మాణిక్యాలరావు మంత్రిగా ఉన్న సమయంలోనే దుర్గగుడిలో తాంత్రిక పూజలు జరిగాయని గుర్తుచేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బస్సు టిక్కెట్ల మీద ప్రచారం కోసం జీవో ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీ బస్ టిక్కెట్ల మీద ఇమామ్‌లు, హజ్‌యాత్ర, జెరూసలేం గురించి ప్రచారం చేయించారని.. ఇప్పటికీ అవే ఆర్టీసీలో కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ విషయంతో తమ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని మల్లాది విష్ణు స్పష్టం చేశారు. తమకు అన్ని మతాలు, ప్రాంతాలు, వర్గాలు సమానమని పేర్కొన్నారు. బస్సు టిక్కెట్ల వ్యవహారంపై దేవాదాయ శాఖ మంత్రి ఇప్పటికే విచారణకు ఆదేశించారని తెలిపారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ టీడీపీ ట్రాప్‌లో పడుతున్నారని ఎమ్మెల్యే విష్ణు విమర్శించారు. ఆవుల మరణానికి ప్రభుత్వానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ మంత్రి ఉండగా చాలా ఆవులు చనిపోయాయని, దానికి బీజేపీ బాధ్యత వహిస్తుందా అని నిలదీశారు. చంద్రబాబు సీఎంగా, మాణిక్యాల రావు మంత్రిగా ఉండగా విజయవాడలో 50హిందూ దేవాలయాలను కూలదోశారని ఆరోపించారు. పుష్కర మరణాలు ఎవరి కాలంలో జరిగాయో అందరికి తెలుసునని.. సదావర్తి దేవుడు భూములను కాజేసిన చరిత్ర టీడీపీ నేతలదని విమర్శించారు. రాష్ట్రంలో మనుగడ కష్టమని తెలిసి... రాజకీయంగా లబ్ది పొందేందుకే బీజేపీ, టీడీపీ కలిసి కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పోలవరంపై వాస్తవ నివేదిక కోరాం

-కేంద్ర జలశక్తి మంత్రి షెకావత్

న్యూఢిల్లీ,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): పోలవరం టెండర్ల రద్దుపై ఏపీ హైకోర్టు స్టే ఇచ్చిందని.. కోర్టు స్టేను అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం కోర్టులో ఉన్నందున ఎలాంటి వ్యాఖ్యలు చేయలేమని చెప్పారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్మాణంలో వాస్తవ నివేదిక పంపాలని ప్రాజెక్టు అథారిటీని ఆదేశించినట్లు షెకావత్ చెప్పారు. రెండురోజుల్లో ఆ నివేదిక వస్తుందన్నారు. నివేదిక వచ్చాక ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు డబ్బు చెల్లించేది కేంద్ర ప్రభుత్వమని.. ఏం జరుగుతుందో తెలుసుకునే హక్కు కేంద్రానికి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. సమాఖ్య వ్యవస్థలో ఎవరికీ ఎవరి ఆశీర్వాదాలు ఉండవని పరోక్షంగా వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డిని ఉద్దేశించి అన్నారు. 'కేంద్రం పని కేంద్రం చేస్తుంది.. రాష్ట్రం పని రాష్ట్రం చేయాలి' అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

# తెలంగాణలో టీఆర్ఎస్ మునుగుతున్న నావ

బిజెపి పట్టు పెంచుకుంటోంది

సభ్యత్వ నమోదే ఇందుకు నిదర్శనం

టిఆర్ఎస్ సభ్యత్వం అంతా బోగస్

మీడియా సమావేశంలో లక్ష్మణ్

హైదరాబాద్,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వాలను చూసి కేటీఆర్ ఉలికిపాటుకు గురయ్యారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ పట్టు పెంచుకుంటోందని అన్నారు. శుక్రవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీజేపీవి ఉత్త లెక్కలు అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ.. టీఆర్ఎస్ సభ్యత్వాల నమోదే అశాస్త్రీయంగా జరుగుతోందని ఆరోపించారు. ములుగు నియోజకవర్గంలో టీఆర్ఎస్‌కు పడిన ఓట్లు 62 వేలు అయితే.. 72వేల సభ్యత్వాలు చేసినట్లు అబద్దాలు చెప్తున్నారని విమర్శించారు. సూర్యాపేట నియోజకవర్గంలో కూడా టీఆర్ఎస్ సభ్యత్వాలు బూటకం అని అన్నారు. తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ మునిగిపోతున్న నావ లాంటిందని వ్యాఖ్యానించారు. దొంగే దొంగ అన్నట్లుగా కేటీఆర్ మాటలున్నాయని విమర్శించారు. తెలంగాణలో బీజేపీకి పెరుగుతోన్న ఆదరణను చూసి టీఆర్ఎస్ భయపడుతోందన్నారు. జై తెలంగాణ అన్న వారిని అణిచివేసి.. నై తెలంగాణ అన్న వారికి పెద్దపీట వేస్తున్నారని విమర్శించారు. బీజేపీ సభ్యత్వాలపై టీఆర్ఎస్ అసత్య ప్రచారం చేస్తోందన్నారు. తెలంగాణలో బీజేపీ 30 లక్షల సభ్యత్వం కలిగి ఉందన్నారు. 11కోట్ల ప్రాథమిక సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ నిలిచిందని పేర్కొన్నారు. బీమా ఆశగా చూపి టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వాలను నమోదు చేస్తోందన్నారు. కానీ పార్టీ సిద్ధాంతాలు నచ్చి ప్రజలు బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో చిదంబరం అరెస్ట్‌పై లక్ష్మణ్ స్పందించారు. చిదంబరం అరెస్ట్‌పై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. జైల్లో చిదంబరం కాంగ్రెస్ వాళ్ల చిట్టా ఎక్కడ విప్పుతారోనని భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. జైల్లో ఉండాల్సిన అనేక మంది కాంగ్రెస్ నాయకులు బెయిల్‌పై బయట తిరుగుతున్నారని విమర్శించారు. భవిష్యత్‌పై తెలంగాణ కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు పాకిస్తాన్ భాష మాట్లాడుతున్నారని లక్ష్మణ్ మండిపడ్డారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కామారెడ్డి, ఆగస్ట్ 24(ఆర్ఎన్ఎ): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సదాశినగర్ ఎంపీపీ అనసూయ అన్నారు. మండలంలోని భూంపల్లి గ్రామంలో శుక్రవారం హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె గ్రామీణులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ.. 6 మొక్కలు నాటి సంరక్షణ చేపట్టాలని సూచించారు. రైతులు పొలం గట్లపై టేకు మొక్కలు నాటితే అధనపు ఆదాయం లభిస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి లలితాభాయ్, ఎంపీడీవో అశోక్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజేశ్వరరావు, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు. గ్రామ శివారులోని అంబరేశ్వర గుట్టపై 200 మొక్కలను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నాటారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాటిన మొక్కలను సంరక్షణ చేపడతామని కమిటీ అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రమేశ్, బల్వంతరావు, నవీన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎవరూ భయపడొద్దు

ఉగ్రవాదల చొరబాటుపై కోయంబత్తూర్ సీపీ

చెన్నై,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): లష్కరే తోయిబా ముఠాకు చెందిన ఆరుగురు ఉగ్రవాదులు కొయంబత్తూర్‌లోకి చొరబడినట్టు నిఘా వర్గాలకు సమాచారం రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తమిళనాడులోని కోయంబత్తూర్ నగరంలో 2వేల మంది పోలీసులను మోహరించినట్టు నగర పోలీస్ కమిషనర్ సుమిత్ శరన్ వెల్లడించారు. షాపింగ్ మాల్స్, ఆలయాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లోనూ పోలీసులను మోహరించామని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. నగరంలోని వివిధ చెక్‌పోస్ట్‌ల వద్ద పోలీసులను అప్రమత్తం చేసి వాహనాల తనిఖీలు చేపడుతున్నట్టు తెలిపారు. అయితే, కొన్ని టీవీ ఛానళ్లు ఫొటోలను ప్రసారం చేస్తున్నాయని.. కోయంబత్తూర్ నగర పోలీసులు ఎలాంటి అనుమానితల ఫొటోలనూ విడుదల చేయలేదని ఆయన స్పష్టంచేశారు. తీరప్రాంతాల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేసినట్టు సుమిత్ తెలిపారు. నిఘావర్గాల సమాచారం మేరకు తమిళనాడులోకి చొరబడిన ముష్కరుల్లో ఒకరు పాకిస్థానీ కాగా.. ఐదుగురు శ్రీలంక తమిళ ముస్లింలు ఉన్నట్టుగా తెలుస్తోంది. హిందువులుగా దేశంలోకి చొరబడి ఉగ్ర చర్యలకు కుట్ర పన్నుతున్నారని నిఘా వర్గాలు సమాచారమిచ్చాయి. రద్దీ ప్రదేశాలు, ప్రముఖ రాజకీయ నాయకులు, విదేశీ రాయబార కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకుని వీరు దాడులకు పాల్పడే ప్రమాదముందని పేర్కొన్నాయి.

# ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమందగమనం

**ఇతర దేశాలతో పోలిస్తే మన దేశ పరిస్థితి మెరుగు**
**25న జీఎస్టీ అధికారులతో భేటీ**
**అక్టోబర్ 1నుంచి కేంద్రీకృత విధానంలో ఐటీ నోటీసులు**
**పన్నుల వసూళ్లలో ఎవరికీ ఇబ్బందులు ఉండవు**
**మీడియా సమావేశంలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్**

న్యూఢిల్లీ,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమందగమనం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అయితే ఇవన్నీ అధిగమించేలా గత ఐదేళ్లలో ఎన్నో వాణిజ్య సంస్కరణల్ని తీసుకొచ్చామని వెల్లడించారు. పన్ను విధానాల్లోనూ సంస్కరణలు తెచ్చామని గుర్తు చేశారు. మిగతా దేశాలతో పోలిస్తే మన దేశ పరిస్థితి మెరుగ్గానే ఉందని వ్యాఖ్యానించారు. భారత్ త్వరితంగా వృద్ధి రేటు నమోదు చేస్తోందన్నారు. ఇదే సందర్భంలో సంపద సృష్టించేవాళ్లను ప్రోత్సహిస్తామన్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె దిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంస్కరణలు అనేవి నిరంతరం జరుగుతాయని.. 2014 నుంచి సంస్కరణలు అజెండాగా పనిచేస్తున్నామని అన్నారు. 25న జీఎస్టీ అధికారులతో సమావేశం నిర్వహిస్తామని, జీఎస్టీని మరింత సులభతరం చేస్తామని అన్నారు. భద్రతను బలోపేతం చేసే విధానాలు దసరా నుంచి ప్రారంభమవుతాయి. పన్నుల వసూళ్లలో ఎవరికీ ఇబ్బందులు ఉండవు. వాణిజ్య యుద్ధం ప్రభావం ప్రపంచ దేశాలపైనా ఉంది ప్రపంచ జీడీపీ 3.2శాతం నుంచి మరింత పతనమవుతోంది. 2014 నుంచి మేం తీసుకొచ్చిన సంస్కరణలతో భారత్ సురక్షిత స్థితి ఉంది. 2014 నుంచి సంస్కరణలే అజెండాగా పనిచేస్తున్నాం అని పేర్కొన్నారు. ఆర్థిక అవకతవకలకు అధిక జరిమానాల రూపంలో శిక్ష ఉంటుందని, అయితే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలను ప్రాసిక్యూట్ చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం కాదన్నారు. ఎంఎస్ఎంఈలను బలోపేతం చేయాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం అని నిర్మలా సీతారమన్ వివరించారు. సీఎస్ఆర్ ఉల్లంఘనలను క్రిమినల్ నేరాల కింద పరిగణించబోం అని కూడా వెల్లడించారు. అక్టోబర్ 1 నుంచి కేంద్రీకృత విధానంలో ఆదాయ పన్ను నోటీసులు ఇస్తాం. అసెసీలకు అనుగుణంగానే పన్నుల విభాగం పనిచేస్తుంది. డీఐఎన్ లేకుండా ఎలాంటి నోటీసులూ ఉండవు. నోటీసులు అందిన మూడు నెలల్లోనే అన్ని కేసులు పరిష్కారమవుతాయి. డీఎన్ఐ లేని నోటీసులకు సమాధానాలు చెప్పాల్సిన అవసరం లేదని చెప్పారు. ఏ అధికారీ సొంతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోరని తెలిపారు. రెపో రేట్లకు అనుగుణంగానే గృహ, వాహన రుణాలపై భారం తగ్గనుందన్నారు. ఈ తగ్గింపుతో గృహ, వాహన రుణాల వాయిదాలు అనుసంధానమవుతాయని చెప్పారు. మార్కెట్‌లో రూ.5లక్షల కోట్ల ద్రవ్య లభ్యతకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. దేశీయ, విదేశీ ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడులపై బ్జడెట్ ముందునాటి విధానం పునరుద్ధరిస్తామన్నారు. బ్యాంకులకు రూ.70వేల కోట్లు ఆర్థిక సర్దుబాటు చేస్తాం. వడ్డీ రేట్ల తగ్గుదలకు కృషిచేస్తాం. వడ్డీ రేట్ల తగ్గింపుతో బ్యాంకులు పొందే లబ్ధిదారులకు చేరేలా ఏర్పాట్లు చేస్తాం. వడ్డీ రేట్ల తగ్గింపును నేరుగా రుణ గ్రహీతలకు అందించేలా చర్యలు తీసుకుంటాం అని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. పన్ను వేధింపులపై వస్తున్న ఆరోపణలకు ఆమె సమాధానం ఇచ్చారు. పన్ను ఎగవేసిన వారిపై జరిమానా విధిస్తున్నామని, కానీ వారిని కోర్టుకు ఈడ్చడంలేదని ఆమె అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ మందగిస్తుందని వస్తున్న ఊహాగానాలను ఆమె కొట్టిపారేశారు. అన్ని ఐటీ నోటీసులను అక్టోబర్ ఒకటవ తేదీలోగా క్లియర్ చేస్తామన్నారు. పన్ను వ్యవస్థలో సమూల మార్పులకు తమ ప్రభుత్వ శ్రీకారం చుట్టిందన్నారు. ఇదేసందర్భంలో 14వేల ట్యాక్స్ కేసులను రద్దు చేసినట్లు మంత్రి తెలిపారు. ఫారిన్ పాలసీ ఇన్వెస్ట్‌మెంట్(ఎఫ్‌పీఐ)లపై సర్‌చార్జీలను ఎత్తివేసినట్లు ఆమె చెప్పారు. ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయడాన్ని మరింత సులభతరం చేసినట్లు ఆమె తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబులిటీ నిధులను ఖర్చు చేయకున్నా.. దాన్ని క్రిమినల్ కేసుగా పరిగణించబోమన్నారు. వాటిని సివిల్ కేసులుగా ట్రీట్ చేయనున్నారు. సూపర్ రిచ్ ట్యాక్స్ నుంచి విదేశీ ఇన్వెస్టర్లను మినహాయిస్తున్నట్లు మంత్రి సీతారామన్ తెలిపారు. స్టార్ట్ అప్స్, ఇన్వెస్టర్లపై విధిస్తున్న ఏంజిల్ ట్యాక్స్‌ను ఉపసంహరించనున్నట్లు ఆమె చెప్పారు. 4 లక్షల కోట్ల లిక్విడ్ క్యాష్‌ను మార్కెట్లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. బ్యాంకులకు సుమారు 70 వేల కోట్ల అదనపు నిధులను రిలీజ్ చేయనున్నట్లు చెప్పారు.

ఇలాంటి పరిస్థితి గతంలో లేదు: రాజీవ్ కుమార్

ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటులో ఇలాంటి పరిస్థితి 70 ఏళ్లలో ఎప్పుడూ లేదని నీతిఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ అన్నారు. ఐదేళ్లలో ఎప్పుడూ లేనంత మందగమనం సందర్భంగా రాజీవ్‌కుమార్ వ్యాఖ్యలకు ప్రధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడుదొడుకుల్లో ఉంది. ఎవరూ ఎవర్నీ నమ్మలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి చక్కదిద్దేందుకు ప్రభుత్వం సరైన సమయంలో తగిన చర్య తీసుకుంటుంది. ఆ చర్యలు ఆర్థిక వ్యవస్థను ఒత్తిళ్ల నుంచి బయటపడేస్తాయి. ఇప్పటికే కేంద్రం, ఆర్‌బీఐ అనేక చర్యలు తీసుకున్నాయి. ద్రవ్యలభ్యతకు ఆర్‌బీఐ తీసుకున్న చర్యలతో స్థిరత్వం వచ్చింది. బ్యాంకింగేతర సంస్థలకు ప్రభుత్వ రంగ బ్యాంకులు నిధులు సమకూరుస్తున్నాయి. ఈ ఏడాది వరుసగా నాలుగుసార్లు రేపోరేటు తగ్గించాయి. రుణగ్రహితలకు తక్కువ వడ్డీలకు రుణాలు అందుతున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీల ఆస్తుల ప్రభుత్వ రంగ బ్యాంకులు కొనుగోలు చేసేలా కేంద్రం చర్యలు తీసుకుందని తెలిపారు.

ఆందోళనకరంగా ఆర్థిక వ్యవస్థ: రాహుల్

దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఇవాళ ఆయన తన ట్విట్టర్ ద్వారా స్పందించారు. దేశ ఆర్థిక వ్యవస్థ దారుణంగా ఉందని ఇటీవల నీతిఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ వెల్లడించారు. ఆ రిపోర్ట్‌ను రాహుల్ తన ట్వీట్‌లో పోస్ట్ చేశారు. ప్రభుత్వ ఆర్థిక సలహాదారులే ప్రభుత్వ వైఫల్యాల్ని ప్రశ్నిస్తున్నారని కాంగ్రెస్ నేత గుర్తు చేశారు. ఇదే విషయాన్ని మేం గత కొన్నాళ్లుగా హెచ్చరిస్తున్నామనాన్నరు. గత 70 ఏళ్లలో ఆర్థిక వ్యవస్థ ఎన్నడూ ఇంత దివాళా తీయలేదని రాజీవ్ కుమార్ అన్న వ్యాఖ్యలను రాహుల్ ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో తమ విధానాలను ఆమోదించాలని రాహుల్ తన ట్వీట్‌లో కోరారు. మళ్లీ మన ఎకానమీని రివోనిటైజ్ చేయాలన్నారు. అవసరమైన వారి చేతుల్లోకి డబ్బు వచ్చేలా చూడాలన్నారు. డబ్బు దాహంతో ఉన్నవారి చేతుల్లోకి కాదన్నారు.




పదేళ్ల లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై జరిగిన కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

## హీరో రాజ్‌తరుణ్ అరెస్ట్

**- బెయిల్‌పై విడుదల**
**- స్టేట్ మెంట్ రికార్డు చేసిన పోలీసులు**
**- డ్రంక్ అండ్ డ్రైవ్ చేశాడా లేదా అని ఆధారాలు లభించలేదు**

హైదరాబాద్, ఆగస్టు24 (ఆర్ఎన్ఎ) : కారు ప్రమాదం కేసులో హీరో రాజ్ తరుణ్‌ను శుక్రవారం మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వెంటనే బెయిల్‌పై విడుదల చేశారు. 279, 336 కింద కేసు నమోదు చేసిన పోలీసులు రాజ్ తరుణ్ స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అలాగే 41సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేశాడా లేదా అనేది తమకు ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మరోవైపు యాక్సిడెంట్ వీడియోతో బ్లాక్ మెయిల్ చేసిన కార్తీక్‌ను కూడా అరెస్ట్ చేశారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్ నార్సింగ్‌లో రాజ్ తరుణ్ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి రాజ్ తరుణ్ వెళ్లిపోయాడు. అయితే అతడు పరుగుపెడుతున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. అలా ఎందుకు పరుగు పెట్టాడో కూడా తెలియలేదు. అనంతరం ఘటనపై రాజ్ తరుణ్ స్పందించాడు. తనకు ఎలాంటి గాయాలు కాలేదని తెలిపాడు. ఆ తర్వాత కారు ప్రమాదం కేసు మరో మలుపుతిరిగింది. ప్రమాదం తరువాత రాజ్ తరుణ్ వీడియోలను కాస్ట్యూమ్ డిజైనర్ కార్తీక్ తీసి బెదిరింపులకు పాల్పడ్డాడని మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఆర్టిస్ట్ రాజా రవీంద్ర ఫిర్యాదు చేశారు. అయితే కార్తీక్ వాదన వేరేలా ఉంది. వీడియోలు డిలీట్ చేయాలని తనని బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ కార్తీక్ మీడియా ముందుకు వచ్చాడు. ఈ క్రమంలో రాజ్ తరుణ్ వీడియోలు డిలీట్ చేయాలని రాజా రవీంద్ర, మరో మహిళ తనపై ఒత్తిడి తెచ్చారంటూ రెండు ఆడియోటేపులను విడుదల చేశాడు.

## వాగులో బోల్తాపడ్డ ఆటో: పలువురికి గాయాలు

మహబూబ్‌నగర్,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): జిల్లాలోని దేవరకద్ర మండలం ఇస్రంపల్లి గ్రామ శివారులోని చిన్నవాగు సమీపంలో ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దేవరకద్ర మండలం కౌకుంట్ల గ్రామం నుంచి ఇస్రంపల్లి గ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సమాజ్‌వాదీ పార్టీ కమిటీల రద్దు

లక్నో,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ అన్ని యూనిట్లను శుక్రవారం రద్దు చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ ఉత్తమ్ మినహా రాష్ట్ర కార్యనిర్వాహక, అన్ని జిల్లాల కార్యనిర్వాహక, యూత్ వింగ్‌లతో పాటు ఇతర విభాగాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం పార్టీ నిర్వహణలో లోపాలను సరిదిద్దుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా పార్టీ రాష్ట్రవ్యాప్త నూతన కార్యవర్గం త్వరలోనే కొలువుదీరనున్నట్లు పేర్కొన్నారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో ఎస్పీ కేవలం ఐదు లోక్‌సభ స్థానాల్లో గెలుపొందిన విషయం తెలిసిందే.

# దళిత మహిళా సర్పంచ్‌పై దాడి

## దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

రంగారెడ్డి,ఆగస్టు24(ఆర్ఎన్ఎ): గర్భిణీ అయిన దళిత మహిళ సర్పంచ్‌పై దాడి చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోనాల పండుగ సందర్భంగా సర్పంచ్ పవిత్ర బోనం సమర్పించడానికి అమ్మవారి గుడికి వచ్చింది. దీంతో అగ్ర కులానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి ఆమెను కించపరిచాడు. మాదిగ కులానికి చెందిన వ్యక్తులు గుడిలోకి ప్రవేశం లేదని, కొబ్బరి కాయలు దేవునికి సమర్పించవద్దని కాంగ్రెస్ నేత ప్రభాకర్ రెడ్డి, జయేందర్ రెడ్డి, మారుతీ రెడ్డి, నరేందర్ రెడ్డి, రామ్ రెడ్డి హెచ్చరించారు. మహిళ సర్పంచ్‌ను రెడ్డి వర్గానికి చెందిన వీళ్లు అసభ్యపదజాలంతో తిట్టారు. దీంతో సర్పంచ్ భర్త వీళ్లతో వాగ్వాదానికి దిగాడు. సర్పంచ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారిపై ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు వారిపై 323, 504 యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. రామ్ రెడ్డి, సుధాకర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి చర్లపలి జైలుకు తరలించామని ఇబ్రహీంపట్నం ఎస్ఐ గురువా రెడ్డి తెలిపారు. ప్రభాకర్ రెడ్డి చెందిన అనుచరుడిపై టిఆర్ఎస్ పార్టీ నుంచి పవిత్ర గెలవడంతో ఆమెపై ప్రభాకర్ కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నాడని గ్రామస్థులు వాపోతున్నారు.

# ముంబై విమానాశ్రాయంలో వ్యక్తి హల్‌చల్

ముంబై,ఆగస్టు24(ఆర్ఎన్ఎ): మరికాసేపట్లో టేకాఫ్ కాబోయే విమానం వద్ద ఓ వ్యక్తి హల్‌చల్ చేసిన ఘటన ముంబై విమానాశ్రయంలో చోటుచేసుకుంది. ఎయిర్ పోర్టు దగ్గర ఓ గుర్తు తెలియని వ్యక్తి విమానం రన్ వేపైకి వచ్చాడు. అదే సమయంలో అక్కడ స్పైస్ జెట్ సంస్థకు చెందిన ఓ విమానం ముంబయి నుంచి బెంగళూరు బయలుదేరేందుకు సిద్దంగా ఉంది. ఆ వ్యక్తి రన్‌వేపై కాసేపు షికార్లు కొట్టాడు. అనంతరం విమానం వద్దకు వచ్చి అక్కడ అంతా పరిశీలించాడు. అతడిని గమనించిన పైలట్ వెంటనే ఇంజిన్‌ను నిలిపివేసి భద్రతా అధికారులకు సమాచారం అందించాడు. దీనికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటి గుల్ పనాగ్ ఈ వీడియోను ట్విటర్‌లో షేర్ చూస్తూ? 'అతడు ఎలా లోపలికి రాగలిగాడు..? అలా వస్తుంటే విమానాశ్రయ సిబ్బంది ఏం చేస్తున్నారు..? ఇంజిన్‌కు చాలా దగ్గరగా వెళ్లాడు. నేను దీన్ని నమ్మలేకపోతున్నాను' అని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎయిర్‌పోర్టు అధికారులు ఆ వ్యక్తి మానసిక పరిస్థితి సరిగా లేదని వివరించారు. గోడ దూకి లోపలికి వచ్చినట్లు గుర్తించామని చెప్పారు.

# అనుమానితులను గుర్తించేందుకు ఫింగర్‌ప్రింట్ డివైజ్‌లను వినియోగించాలి

## కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, ఆగష్టు 24 (నేటినిజం ప్రతినిధి):అనుమానితులను గుర్తించేందుకు పోలీసులు పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్‌లను వినియోగించాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. సంబంధింత అధికారులు రాత్రివేళల్లో గస్తీ నిర్వహించే బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ విహనాల విభాగాల పోలీసులకు కూడా అందించాలని ఆదేశించారు.

శుక్రవారం నాడు కమీషనరేట్ కేంద్రంలో పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి పోలీసు అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఫ్రింగర్‌ప్రింట్ డివైజ్ ద్వారా తటస్థపడిన అనుమానితులు దేశవ్యాప్తంగా ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోనైనా ఏదైనా నేరానికి పాల్పడిఉన్నారా?లేదా? అనే విషయం క్షణాల వ్యవధిలో ఒకవేలి ముద్రద్వారా తెలుస్తుందన్నారు. అనుమానితులను పోలీస్‌స్టేషన్లను తీసుకవెళ్ళి కాలయాపన చేయవద్దని సూచించారు. ఏ నేరసంఘటనలోనైనా పోలీసు అధికారులు క్లూస్‌టీం విభాగం సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ-పెట్టికేసుల నమోదు సందర్భంగా నిందితులను నేరస్థలంలోనే ఫోటోలను తీయాలని చెప్పారు. సాండ్‌ట్యాక్సీపాలసీలో సభ్యత్వం తీసుకున్న ట్రాక్టర్లను మాత్రమే ఇసుక రవాణాకు అనుమతించాలని తెలిపారు. వివిధ రకాల నేరసంఘటనలలో సాధ్యమైనన్ని సాక్ష్యాధారాలను సేకరించాలని చెప్పారు. 5ఎస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని పేర్కొన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులకు అనుమతి ధరఖాస్తు పత్రాన్ని అందించాలని తెలిపారు. విగ్రహాలు ఏరోజు నిమజ్జనానికి వెళుతున్నాయెూ సమాచారం సేకరించాలని తెలిపారు. హైదరాబాద్,రాచకోండ,సైబరాబాద్‌లలో జరిగే నవరాత్రోత్సవాలకు కమీషనరేట్ నుండి 27శాతం పోలీసులు తరలివెళ్ళాల్సిఉందని చెప్పారు. పోలీసులు సెల్‌ఫోన్ వినియోగానికి సమయం తగ్గించి, పోలీస్‌శాఖ అందుబాటులోకి తెచ్చిన ఆధునిక సాంకేతిక వినయోగంపై అవగాహన పెంపొందించుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించాలని తెలిపారు. టెక్నాలజీపై పరిపూర్ణత సాధించడం ద్వారానే ప్రజలకు సమర్ధవంతమైన సేవలందించేందుకు ముందుకుసాగవచ్చని పేర్కొన్నారు.



. మహబూబ్‌నగర్ లోక్‌సభ సభ్యుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమి చైర్మన్ శివకుమార్‌లు హైదరాబాద్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మల్యాతో సమావేశమయిన దృశ్యం

# రైల్వే జిఎంతో పాలమూరు ప్రతినిధుల భేటీ

హైదరాబాద్,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): మహబూబ్‌నగర్ లోక్‌సభ సభ్యుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమి చైర్మన్ శివకుమార్‌లు హైదరాబాద్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మల్యాతో సమావేశమయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి వద్ద ఆర్‌యూబీ ఎత్తు పెంచాలని, దీని ఎత్తుపెంచడం వల్ల ఏడు గ్రామాల ప్రజలకు, వ్యవసాయదారులకు మార్గం సులభతరం అవుతుందని విజ్ఞప్తి చేశారు. బాదేపల్లి పట్టణంలోని నల్లకుండ దగ్గర రోడ్ అండర్ బ్రిడ్జ నిర్మించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జనరల్ మేనేజర్ త్వరితగతిన పనులు చేపడతామని తెలిపారు.

# పాక్‌లో ఆడనున్న శ్రీలంక

## భద్రతా చర్యలపై సమీక్ష

లాహోర్,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): ఎట్టకేలకు పాకిస్థాన్ గడ్డపై మళ్ళీ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరగబోతున్నాయి. అది కూడా గతంలో పాక్‌లో ఉగ్రవాదుల దాడికి గురైన శ్రీలంక జట్టే ఇక్కడ ఆడబోతోంది. ఈ మేరకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సిరీస్‌కు సంబంధించిన షెడ్యూల్ ను విడుదల చేసింది. ఎఫ్ టి పి షెడ్యూల్ ప్రకారం పాక్ లో శ్రీలంక మూడు వన్డేలు, మూడు టీ ట్వంటీలు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఆడనుంది. ఇది ముగిసిన తర్వాత డిసెంబర్ లో రెండు టెస్టులు కూడా పాక్ లోనే ఆడనుంది. దీనికి సంబంధించి ఇరు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య ఒప్పందం కుదిరినట్టు పిసిబి వెల్లడించింది. మూడు వన్డేలు కరాచీలో జరగనుండగా... మూడు టీ ట్వంటీలకు లాహోర్ ఆతిథ్యమివ్వనుంది. శ్రీలంక జట్టుపై 2009లో ఇక్కడ ఉగ్రవాదుల దాడి జరిగింది. ఈ ఘటనతో యావత్ క్రికెట్ ప్రపంచం ఉలిక్కి పడితే... ఏ జట్టూ కూడా పాక్ లో ఆడేందుకు ముందుకు రాలేదు. దాదాపు తొమ్మిదేళ్ళుగా అక్కడ ఒక్క అంతర్జాతీయ సిరీస్ కూడా జరగలేదు. దీంతో పాకిస్థాన్ యుఎఇని తటస్థ వేదికగా చేసుకుని ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడుతూ వస్తోంది. గత కొంత కాలంగా తమ గడ్డపై అంతర్జాతీయ క్రికెట్ ను పునరుద్ధరించేందుకు పాక్ బోర్డు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. దీనిలో భాగంగానే ఇటీవల ఐసిసి వరల్డ్ ఎలెవన్ తో పాటు శ్రీలంక, వెస్టిండీస్ జట్లతో టీ ట్వంటీ సిరీస్‌లు ఆడింది. అలాగే పాకిస్థాన్ సూపర్ లీగ్ లో కొన్ని మ్యాచ్‌లను కూడా లాహోర్ లో నిర్వహించింది. ఆటగాళ్ళకు ప్రెసిడెంట్ స్థాయి భద్రతను ఏర్పాటు చేస్తుండడంతో ఎట్టకేలకు శ్రీలంక జట్టు ఇక్కడ పర్యటించేందుకు అంగీకరించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే శ్రీలంక క్రికెట్ సెక్యూరిటీ విభాగం స్టేడియాలతో పాటు ఆటగాళ్ళు బస చేసే హోటల్స్ దగ్గర భద్రతా ఏర్పాట్లను పరిశీలించింది. వారు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాక్ లో లంక టూర్ కు క్లియరెన్స్ వచ్చినట్టైంది.

## పట్టిసీమ పంపులకు పునఃప్రారంభం

ఏలూరు,ఆగస్టు24(ఆర్ఎన్ఎ): పోలవరం మండలంలోని పట్టిసీమ వద్ద గోదావరి నదిపై నిర్మించిన పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం పునఃప్రారంభించారు. ప్రాజెక్టు ఎస్ఈ నాగిరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని పంపులను ప్రారంభించారు. సాయంత్రానికి 21 పంపులను విడతల వారీగా ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఇటీవల కృష్ణానదికి వరదలు రావడంతో పట్టిసీమలోని పంపులను నిలిపివేశారు. అక్కడ వరదలు తగ్గుముఖం పట్టడంతో తిరిగి ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు.

# పై పూతలతో పుండు మానదు

హైదరాబాద్, ఆగష్టు 24:మందగించిన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటు న్నట్లు చేసిన ప్రకటనలు పైపూతగానే మిగిలిపోగలవు తప్ప లోపల పుండును మాన్పలేవని గుర్తుంచు కోవాలి. ఎతకాలం పైపూతలతో వ్రణాన్ని తగ్గించలేం. పుండును పూర్తిగా తొలగించడంతో పాటు మూలాన్ని లేకుండా చేయగలగాలి. అనేక కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఆర్థిక పరిస్థితి గాడినపడడం సాధ్యం కాదని మోడీ సర్కార్ గుర్తించాలి. ఎందరో ఆర్థికవేత్తలు ఉన్న మనదేశంలో మేధాశక్తికి కొదువ లేదు. అలాంటి వారి సలహాలు తసీఉకోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను గాడిన పడేలా చేయాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచేలా చేయాలి. అలాగే ఉచిత పథకాలను నిర్దాక్షిణ్యంగా ఎత్తేయాలి. వ్యవసాయ,పారిశ్రామిక రంగాలను సమానం గా ప్రోత్సహించాలి. ప్రసత్తు ఉద్దీపనలతో పారిశ్రామిక రంగానికే పెద్దగా మేలుచేసేలా ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టే చర్యలకు పూనుకోకుంటే మొత్తంగానే కుప్పకూలే దుస్థితి రాకమానదు. అలాంటి పరిస్థితులకు ప్రస్తుత పరిస్థితులు ఓ హెచ్చరికగా గుర్తించి ముందుకు సాగాల్సిన సమయమిది. జివిఎస్టీ తీసుకుని వచ్చిన తొలినాళ్లలో అంతా సర్దుకుంటుందని, అంతా బాగుపడుతుందని ఘంటాపథంగా చెప్పారు. దీనివల్ల పన్నుల భారంపెరిగిందే తప్ప ప్రజలకు మేలు జరగడం లేదు. ఏది కొనాలన్నా జివిఎస్టీ వాయింపుతో సామాన్యులు కుదేలవుతున్నారు. నిర్మాణ రంగంలో ధరలమోత మోగుతోంది. ప్రజలు సొంతం గా గూడు కొనుక్కునే పరిస్థితి లేకుండా పోయింది. స్టీలు, సిమెంట్ ఇసుక వంటి ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. వీటికి కళ్లెం వేయకుంటే మరింత గడ్డు పరిస్థితి రావచ్చు. ధరల పెరుగుదల ఏ రకంగానూ అభివృద్ధికి సూచిక కాదని గుర్తుంచుకోవాలి. అధికారంలోకి వచ్చిన 2014 నుంచి సంస్కరణల ఏజెండాగా పనిచేస్తుండటం వల్లనే ఆర్థిక వ్యవస్థ బలపడిందని, భవిష్యత్తులో కూడా సంస్కరణలు కొనసాగించనున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అమెరికా, చైనా తదితర దేశాలతో పోలిస్తే భారత ఆర్థిక వ్యవస్థ మెరుగ్గానే ఉందన్నారు. మరోవైపు సంపదను సృష్టించే వాళ్లను ప్రోత్సహిస్తామని మంత్రి తెలిపారు. విదేశీ సంస్థాగత పెట్టుబడి దారులతోపాటు దేశీయ ఈక్విటీ పెట్టుబడి దారులకు ఊరట కల్పించేలా సంపన్న వర్గాల సర్చార్జి నుంచి వీరికి మినహాయింపునిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టిన సార్వత్రిక బ్జడెట్‌లో రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల మధ్య వార్షిక ఆదాయం కలిగినవారిపై సర్చార్జిని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచిన కేంద్రం..రూ.5 కోట్లపైన ఆదాయం కలిగిన వారికి సర్చార్జిని 15 శాతం నుంచి 37 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. ఈ పరిధిలోకి ఎఫ్‌పీఐలు రావడంతో ఈక్విటీ మార్కెట్ల నుంచి ఇప్పటి వరకు 3 బిలియన్ డాలర్ల నిధులను ఉపసంహరిం చుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం వీరిపై విధిస్తున్న సర్చార్జిని పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. క్యాపిటల్ మార్కెట్లోకి పెట్టుబడు లను ప్రోత్సహి ంచడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు. దీంతో కేంద్ర ప్రభుత్వం రూ.1,400 కోట్ల ఆదాయం కోల్పోవాల్సి రావచ్చునని మంత్రి పేర్కొన్నారు. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో ఎఫ్‌పీఐల విధిస్తున్న పన్ను 7 శాతం నుంచి 4 శాతానికి తగ్గనున్నది. మరోవైపు ప్రపంచ దేశాలు ఆర్థిక మందగమన పరిస్థితులలో కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ ఆశించిన స్థాయిలో ఉన్నదని చెప్పారు. ఇకపోతే ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించాలని, అలాగే జీఎస్టీలో కోత విధించాలని ఆటోమొబైల్ రంగ ప్రతినిధులు విన్నపాలను కేంద్రం పెడచెవిన పెట్టింది. అలాగే ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ సబ్‌కమిటీ చేసిన నిర్ణయాలు కార్పొరేట్లకు వరాలు గుప్పించి, కష్టజీవులను ఇబ్బందులకు గురి చేసేవిగా వున్నాయి. మూడు విమానాశ్రయాలను అదానీకి అప్పనంగా కట్టబెట్టిన ప్రభుత్వం అన్నదాతలకు మాత్రం పంటల మద్దతు ధరలను నామమాత్రంగా పెంచింది. బ్రిటిష్ పరిపాలనా కాలంనాటి నుండి కార్మికులకున్న హక్కులను మంట గలిపేలా వేజ్ కోడ్ బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. కార్మికులకు వేతన భద్రత లేకుండా చేసి, రైతులకు తగిన మద్దతు ధరలివ్వకుండా మరోవైపు ప్రజల సొత్తయిన ఎయిర్ పోర్టులను కార్పొరేట్లకు అప్పగించడం ద్వారా ఈ ప్రభుత్వం కాకుల్ని కొట్టి గద్దలకు వేసే విధానాలు అనుసరిస్తోందని స్పష్టం అవుతోంది. ఎఫ్‌సిఐ, నాఫెడ్ తదితర ప్రభుత్వ సంస్థలన్నిటినీ ఉదారవాద విధానాలతో నిర్వీర్యం చేసేశారు. ప్రైవేటు వ్యాపారి చెప్పిన ధరకే రైతు పంటను తెగనమ్ముకోవలసి వస్తోంది. పెరిగిన ఎరువులు, డీజిల్, పురుగు మందుల ధరలు, నిత్య జీవితావసరాల భారంతో పోల్చితే కేంద్ర ప్రభుత్వం పెంచిన ఈ కనీస మద్దతు ధరలు ఏ మూలకూ చాలవు. ఇప్పటికే సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న గ్రామీణ వ్యవస్థ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో మరింత సంక్షోభంలోకి కూరుకుపోవడం ఖాయంగా ఉంది. ఇకపోతే విమానాశ్రయాలకు ప్రైవేటీకరణ ప్రమాదం మాత్రం పొంచి వుంది. శ్రమతో సంపద సృష్టిస్తున్న కార్మిక, కర్షక వర్గాలకు అనుగుణంగా విధానాలను మార్చాల్సిఉంది. ప్రజలను స్వయం సమృద్ధి దిశగా ప్రోత్సహించాలి. గ్రామాలను బలోపేతం చేస్తూ పోవడంతో పాటు సంపద సృష్టించే విధానాలు కొనసాగించాలి. పైపూత చర్యలను మానుకోవాలి. అప్పుడే ఆర్థిక వ్యవస్థ గాడిన పడగలదు. అందుకు అనగుణంగా భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి.

# గణేశ్ ఉత్సవాల్లో గంగాహారతి

**పండితులతో చర్చించి కార్యక్రమం ఖరారు**
**నగరంలో 54వేల గణేష్ విగ్రహాల ప్రతిష్ట**
**గణేశ్ ఉత్సవాలపై మంత్రుల సమీక్ష**
**వివరాలు వెల్లడించిన మంత్రి తలసాని**



హైదరాబాద్,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఈసారి హుస్సేన్ సాగర్ వద్ద గంగాహారతి నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వెల్లడించారు. అలాగే ఎప్పుడు నిర్వహించేది పండితులను నిర్ణయించి ప్రకటిస్తామన్నారు. ఈసారి నగరంలో 54వేల గణేష్ విగ్రహాలను ప్రతిష్టించే అవకాశం ఉందన్నారు. ఉత్సవాలను తిలకించడానికి దేశ విదేశాల నుంచి భక్తులు వస్తారని అన్నారు. ప్రభుత్వం తరపున హుస్సేన్‌సాగర్‌కు గంగాహారతి ఇస్తామని ఆయన తెలిపారు. పురోహితులో చర్చించి ఈకార్యక్రమాన్నిఎప్పుడు నిర్వహించాలన్నది నిర్ణయిస్తామన్నారు. ఉత్సాలపై మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, మల్లారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, నగర పోలీస్ కమిషనర్లు అంజనీకుమార్, సజ్జనర్, మహేశ్ భగవత్, జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిశోర్, నగర మేయర్ బొంతు రామ్మోహన్, నగరానికి చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి నగరంలో 26 చోట్ల ఏర్పాటు చేస్తున్నట్టు తలసాని తెలిపారు. హైదరాబాద్ నగరం చుట్టుపక్కల ఉన్న చెరువుల్లో నిమజ్జనానికి ఏర్పాట్లుచేస్తున్నామని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భరీఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లో గణెశ్‌ఉత్సవాలంటే దేశమంతా ఆసక్తిగా చూస్తుంది. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం ఈసారి భారీ ఏర్పాట్లను చేస్తుందన్నారు. అలాగే నగరంలోనే అతిపెద్ద గణెశ్ విగ్ర హం ఖైరతాబాద్ గణెశ్ పనులను సోమవారం పరిశీలిస్తామని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లను గణెశ్‌ఉత్సవ సమితి కూడా ప్రశంసించిందన్నారు. గణెశ్ ఉత్సవాల ఏర్పాట్లు, సీసీ కెమెరాల ఏర్పాట్లు, శాంతి భద్రతలపై సమావేశంలో చర్చించారు. ప్రతి సంవత్సరం హైదరాబాద్‌నగరంలో భారీఎత్తున జరిగే గణెశ్‌ఉత్సవాలను ఈసారి కూడా మరింత ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే ఏర్పాట్లపై శుక్రవారం పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హోంమంత్రి మహమూద్‌అలీ, మల్లారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్‌తో కలిసి ఆయా శాఖల అధికారులతో సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ ఉత్సవాలసందర్భంగా నగర వాసులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ఆయాశాఖల అధికారులతో వివిధ అంశాలపై చర్చించామన్నారు. హోంమంత్రి మహమూద్‌అలీ మాట్లాడుతూ అన్ని పండగలకూ తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఈసారి గణెశ్ ఉత్సవాలు భారీగా నిర్వహిస్తామన్నారు. మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ అన్నిశాఖల సమన్వయంతో గణెశ్‌ఉత్సవాలు ఈసారి ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయని అన్నారు. ఉత్సవాల్లో ఏ విధమైన అవాంతరాలు కలగకుండా అన్నిశాఖలతో సమన్వయం చేస్తున్నామన్నారు.



మంత్రి నిరంజన్ రెడ్డిని కలుసుకున్న వివిధ ప్రాంతాల రైతు ప్రతినిధులు

# ఎరువుల కొరత లేకుండా చర్యలు: మంత్రి

హైదరాబాద్,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): ప్రస్తుత ఖరీఫ్‌కు 8.50 లక్షల టన్నుల యూరియాను కేంద్రం కేటాయించిందని వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెల్లడించారు. గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి రావడం, కృష్ణా పరీవాహక ప్రాంతంలో వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండుగా ఉండడంతో సాగు పెరిగిందని మంత్రి తెలిపారు.

ఈ క్రమంలోనే ఎరువుల వాడకం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ పరిస్థితిని ముందే ఊహించినందున కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి నరేంద్రసింగ్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసినట్లు చెప్పారు. జిల్లాలవారీగా యూరియా డిమాండ్ వివరాలను అందించామన్నారు. కృష్ణపట్నం, విశాఖపట్నం పోర్టుల్లో ఉన్న యూరియాను తెలంగాణ ర్యాక్ పాయింట్లకు తరలించాలని కోరినట్లు నిరంజన్ రెడ్డి వెల్లడించారు. కేంద్రం వెంటనే యూరియా కోటాను పంపిస్తుందని భావిస్తున్నామని చెప్పారు.

# జీఎస్టీ భారాన్ని తగ్గించే ప్రయత్నాలు సాగాలి

## తాజా ఆర్థిక మాంద్యం నేపథ్యంలో చర్యలకు పూనుకోవాలి

న్యూఢిల్లీ,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): జీఎస్టీ అమల్లోకి వచ్చాక పన్ను చెల్లించే కంపెనీల సంఖ్య గణనీయంగా పెరిగింది. జీఎస్టీతో కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతున్నప్పటికీ, జీఎస్టీ అమలుతో సామాన్యులు, చిరు వ్యాపారుల మాత్రం సతమతమవుతున్నారు. ప్రతిదీ జిఎస్టీ కిందకు రావడంతో భారీగా టాక్స్ పడుతోంది. రియల్ రంగంలో ఇళ్లు కొనాలకుంటున్న వారికి మరింత భారంగా మారింది. గత రెండేళ్ల అనుభవాలను చూస్తే పెద్దగా దీనివల్ల లబ్ధి పొందిన రంగాలు కానరావడం లేదు. అంతేగాకుండా జీఎస్టీ కారణంగా నిత్యావసరాలు మొదలు అన్ని వస్తువు లధరలు విపరీతంగా పెరిగాయే తప్ప తగ్గలేదు. దీంతో ప్రజలు పొదుపుగా తినే పరిస్థితి ఏర్పడింది. జీఎస్టీ అమలు మన దేశంలో ముక్కుపిండి వసూలు చేసే టాక్స్‌గా మారింది. 25న జిఎస్టీ సమావేశంలో మళ్లీ చర్చ చేస్తామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారమన్ ప్రకటించిన నేపథ్యంలో తగు చర్యలకు పూనుకోవాల్సి ఉంది. ప్రపంచవ్యాప్తంగా 160 దేశాల్లో జీఎస్టీ అమలులో ఉన్నది. కానీ చాలా దేశాల్లో జీఎస్టీ అమలు తీరు ఆశాజనకంగా లేదు. మలేషియాలో జీఎస్టీ 2015 నుంచి అమల్లోకి వచ్చింది. జీఎస్టీ వలన వస్తుసేవల ధరలు పెరుగడంతో మలేషియా ప్రజల్లో 64.1 శాతం మంది తమ వినియోగాన్ని తగ్గించుకున్నారని తేల్చింది. రెండేండ్ల తర్వాత జీఎస్టీ మీద అక్కడి ప్రజల ఆందోళనతో జీఎస్టీని ఎత్తివేశారు. జీఎస్టీ పుట్టినిల్లయిన ఫ్రాన్స్, కెనడా వంటి దేశాల్లో దీని అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. దేశంలో జీఎస్టీకి ముందు పరోక్షపన్నుల రూపంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానం ద్వారా ఆయా రాష్ట్రాలు, కేంద్రం ప్రజల నుంచి పరోక్ష పన్నులు వసూలు చేసేవి. అంతేకాదు, ఒక వ్యాపారి 17 రకాలైన పన్ను రిటర్న్‌లు, 17 రకాలైన అసెస్మెంట్‌లు చేయాల్సి వచ్చేది. చాలారకాలైన వస్తువులపై 31 శాతం పన్ను విధించేవారు. ఇప్పుడు దేశమంతా ఒకే పన్ను విధానం తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2017 జూలై 1వ తేదీ నుంచి వస్తుసేవల పన్నును అమల్లోకి తీసుకొచ్చింది.

జీఎస్టీ ప్రవేశపెట్టక ముందు దాదాపుగా 235 వస్తువులపై 31 శాతం లేక అంతకంటే ఎక్కువ గాని పన్ను విధించేవారు. జీఎస్టీ వచ్చిన తర్వాత అన్ని వస్తువులపై పన్ను గరిష్ఠంగా 28 శాతం మాత్రమే విధించారు. సౌకర్యవంతమైన వస్తువులపై అనగా కార్లు, ఏసీ, రిఫ్రిజిరేటర్, సిగరెట్ ఇంకా ఎక్కువ విలువ గల మోటార్ సైకిల్ మొదలగునవి మాత్రమే 28 శాతం పన్ను పరిధిలోకి తీసుకువచ్చారు. ఏతావాతా పరిశీలించి చూస్తే చాలా దేశాల్లో జీఎస్టీ అమలు తీరు ఆశాజనకంగా లేదని తేలింది. జీఎస్టీతో వస్తువుల ధరలు పెరుగడమే కాదు, ప్రపంచవ్యాప్తంగా అత్యంత సంక్లిష్టమైన జీఎస్టీ మనదే అని చెప్పక తప్పదు. చాలా దేశాల్లో జీఎస్టీ ఒకే స్లాబ్‌కు పరిమితమైతే మన దేశంలో మాత్రం దానిని ఏడు స్లాబులకు పెంచారు. జీఎస్టీతో ఇతర దేశాల్లో ఎదురవుతున్న సమస్యలు దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని మరింత సులభతరం చేయాల్సి ఉంది. పన్నుల చెల్లింపు ఎంత సులభంగా ఉంటే వ్యాపారాలు అంతగా పురోగమిస్తాయి. జీఎస్టీతో కొన్ని వస్తువులపై పన్నులు తగ్గి సత్ఫలితాలు వస్తున్నప్పటికీ, అవి ప్రభుత్వానికే మేలుచేసేలా ఉన్నాయి కానీ సామాన్యుడి జీవితాన్ని ప్రత్య క్షంగా ప్రభావితం చేయలేదని గుర్తించాలి. సామాన్యుని జీవితాన్ని ప్రభావితం చేసే పెట్రోల్, డీజిల్ వంటి వస్తువులు జీఎస్టీ పరిధిలోకి లేకపోవడమే దీనికి కారణం. జీఎస్టీ ఫలాలు భవిష్యత్తులో ప్రజలకు ఇంకా చేరువయ్యేలా ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. 25న జీఎస్టీ మండలి సమావేశంలో చర్చిస్తామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పన్నులను ముక్కుపిండి వసూలు చేసి, దోచిపెట్టే పద్దతులు మారనంత వరకు ఎంతగా ఆదాయం వచ్చినా లాభం ఉండదని గుర్తుంచుకోవాలి.

# చెరువుల పునరుద్దరణ కళ్లకు కనిపిస్తున్న వైనం

**మిషన్ కాకతీయపై ఇక విమర్శలకు చెల్లు**
**నీతి ఆయోగ్ నివేదికతో సర్కార్‌కు ప్రశంసలు**
**విమర్శకులు కళ్లు తెరవాలన్న మంత్రి ఎర్రబెల్లి**

హైదరాబాద్,ఆగస్ట్24 (ఆర్ఎన్ఎ): చెరవులతోనే ఊరికి ఆదెరువు అన్న నానుడిని సిఎం కెసిఆర్ నిరూపించారు. పట్టుబట్టి చెరువులను మిషన్ కాకతీయకింద పునరుద్దరించారు. ఇంకా పునరుద్దరణ కార్యక్రమాలు సాగుతున్నాయి. ఇప్పటికే నిండిన చెరువుల కింద పంటలు సాగవుతున్నాయి. అలాగే46 వేల చెరువులను పునరుద్ధరించి, 20 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ మొదలుపెట్టింది. చిన్నతరహా నీటివనరులను బలోపేతం చేయడం, నీటి యాజమాన్య పద్ధతులను ప్రోత్సహించడం, చెరువులను పునరుద్ధరించడం, కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో చిన్నతరహా సాగునీటి రంగానికి కేటాయించిన 255 టీఎంసీలను సమర్థంగా ఉపయోగించుకోవడమే దీని ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాలు సాగాయి. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల కింద సాగునీరు అందే భూముల పరిధి 51.5 శాతం పెరిగిందని నీతి అయోగ్‌కు అందిన నివేదిక వెల్లడించడం ఇప్పుడు ప్రభుత్వం ఏ విధంగా కష్టపడిందో తెలిసిపోయిందని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అభిప్రాయపడ్డారు. విమర్శకులు ఇకనైనా వారి నోళ్లకు తాళాలు వేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకంలో చిత్తశుద్ధి ఉందని నిరూపితం అయ్యిందన్నారు. మిషన్ కాకతీయను కమిషన్ కాకతీయ అని విమర్శించిన వారికి ఇదో చురక లాంటిదిగా గుర్తించాలి. ఇప్పటికే అనేక చెరువుల కింద సాగుతో పాటు, చేపల పెంపకం సాగుతోంది. ఇదంతా నీరు చేరడం వల్ల మాత్రమే సాధ్యం అయ్యింది.

2018 మార్చినాటికి 22,500 చెరువులు పునరుద్ధరించారు. దీనివల్ల చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ కాకతీయ పథకం అద్భుతంగా ఉందని నీతి ఆయోగ్ ప్రశంసించడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాన్ని గుర్తించినట్లు అయ్యింది. నీటివనరుల పునరుద్ధరణలో తెలంగాణ దేశంలో తొలిస్థానంలో నిలిచిందని పేర్కొంది. మూడేళ్లలో సాగునీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకున్న తొలి రెండు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా చూపింది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో జలవనరుల పునరుద్ధరణ గొప్పగా జరిగిందని.. ఈ విషయంలో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని విడుదల చేసిన 'సమగ్ర నీటి యాజమాన్య సూచిక' నివేదికలో వెల్లడించింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు జలవనరుల నిర్వహణ, తాగు, సాగునీరు అందించడంలో చూపుతున్న ప్రతిభను ఆధారంగా చేసుకొని నీతి ఆయోగ్ మూడేళ్లుగా నివేదికలు విడుదల చేస్తోంది. 2019 సంవత్సరానికి చెందిన నివేదికను కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్, సీఈఓ అమితాబ్‌కాంత్‌లు విడుదల చేశారు.ఇందులో తెలంగాణలో జరిగిన మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. దానివల్ల చెరువుల కింద 51.5 శాతం మేర సాగు పెరిగినట్లు పేర్కొన్నారు. అంతేగాకుండా జలవనరుల కింద సాగునీటి యోగ్యతను వంద శాతం పునరుద్ధరించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. 60 శాతం గ్రామీణ ప్రాంతాలకే తాగునీరు అందుతున్నప్పటికీ నీటినాణ్యత సమస్యలను 100 శాతం పరిష్కరించింది. గ్రామీణ ప్రాంతా ల్లో ఎదురవుతున్న నీటి నాణ్యత సమస్యలను తగ్గించడంలో తెలంగాణ దేశంలో రెండోస్థానంలో నిలిచింది.



# సగిలేరు కాల్వకు గండి

కడప,ఆగస్టు24(ఆర్ఎన్ఎ): కలసపాడు స్థానిక తెలుగుగంగ ప్రధాన ఎడమకాల్వకు సంబంధించి సగిలేరు ప్రధాన కాల్వపై నిర్మించిన అక్విడెట్‌కు గుర్తు తెలియని వ్యక్తులు యంత్రంతో రంధ్రంచేసి కిందకు పైపు ఏర్పాటు చేశారు. కొంతమంది తమ స్వార్థం కోసం ఈ చర్యకు పాల్పడినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ఈ అక్విడెట్‌ను కొన్నేళ్ల క్రితం రూ.2.50 కోట్లతో నిర్మించారు. ఈ విషయమై శుక్రవారం తెలుగుగంగ ఎస్‌ఈ శారదను వివరణ కోరగా ఈ ఘటన ప్రజాధనాన్ని నష్టపరచడమే అన్నారు. ఈ రంధ్రం ఏర్పాటు వల్ల భవిష్యత్తులో అక్విడెట్‌కు ఇబ్బంది కలగవచ్చని తెలిపారు.

# కశ్మీర్‌కు రాహుల్ గాంధీ

హైదరాబాద్, ఆగష్టు 24: ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌లో ఇంకా ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ విపక్షాలు శ్రీనగర్‌కు వెళ్తున్నాయి. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో అనేక మంది నేతలు ప్రయాణం అయ్యారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతో పాటు ఇతర నేతలు కశ్మీర్‌కు వెళున్నారు. విపక్షాల బృందంలో టీఎంసీ, సీపీఐ, ఆర్జేడీ, ఎల్‌జేడీ, సీపీఐ, డీఎంకే, ఎన్సీపీ, జనతాదళ్, ఎస్పీ నేతలు ఉన్నారు. గులాం నబీ ఆజాద్, సీతారం ఏచూరి, డీ రాజా, మనోజ్ ఝా, ఆనంద్ శర్మ, మజీద్ మీమన్, వేణుగోపాల్, తిరుచి శివ, శరద్ యాదవ్, దినేశ్ త్రివేదిలు ఉన్నారు.

క్రీడలు






# రోహిత్,అశ్విన్ లను పక్కన పెట్టడంపై విమర్శలు

ఆంటిగ్వా,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): వెస్టిండీస్ తో జరుగుతోన్న తొలి టెస్టులో భారత తుది జట్టు కూర్పుపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. సోషల్ మీడియా వేదికగా అభిమానులు రెండు వర్గాలుగా విడిపోయి విమర్శలు గుప్పించుకుంటున్నారు. వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఏకంగా ఐదు సెంచరీలు చేసి అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. విండీస్ పర్యటనలోనూ ఓ అర్ధ సెంచరీ చేసి మోస్తరుగా రాణించాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌లో కూడా అర్ధ సెంచరీ చేసాడు. అయినా రోహిత్‌ను పక్కనబెట్టడంతో కోహ్లి–రోహిత్ మధ్య విభేధాలు అలానే ఉన్నాయని అభిమానులు అంటున్నారు. సోషల్ మీడియాలో కోహ్లీపై రోహిత్ ఫ్యాన్స్ ఒక రేంజ్ లో విమర్శలు గుప్పించారు. విరాట్ కోహ్లి నిజంగా ఒక ఇడియట్, స్టుపిడ్ కెప్టెన్ అని నిరూపించాడు. ఒక్క ఐపీఎల్ ట్రోఫీ గెలవని కోహ్లి.. రోహిత్ శర్మను పక్కన పెట్టాడు' అంటూ ఓ అభిమాని ఘాటుగా విమర్శించాడు. ఇక మరో అభిమాని తాజా పరిణామాలతో కోహ్లి–రోహిత్ మధ్య విభేధాలు అలానే ఉన్నాయనడానికి ఇదే నిదర్శనమంటూ ట్వీట్ చేశాడు. అటు కోహ్లికి ఇష్టమైన ఫెయిల్యూర్ ఆటగాడు కేఎల్ రాహుల్ జట్టులో ఉన్నాడు. కానీ.. రోహిత్ లేడు. కోహ్లి సొంత ప్రయోజనాల కోసం జట్టును నాశనం చేస్తున్నాడని విమర్శించారు కొందరు. ఇక రవిశాస్త్రి–కోహ్లిల కాంబినేషనే టీమిండియాకు ప్రమాదమంటూ... వీరిద్దరే క్రికెట్ జట్టును నాశనం చేస్తున్నారంటూ మరికొందరు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అయితే కోహ్లి అభిమానులు దీనికి ధీటుగానే బదులిస్తున్నారు. టెస్టుల్లో రోహిత్ విఫలమైన ఆటగాడు కాబట్టే చోటు దక్కలేదని కోహ్లి ఫ్యాన్స్ భారత కెప్టెన్ నిర్ణయాన్ని సమర్థించారు. ఇదిలా ఉంటే అటు మాజీ క్రికెటర్ సునీల్

గవాస్కర్ సైతం తుది జట్టులో స్పిన్నర్ అశ్విన్ కు చోటు లేకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కరేబియన్ జట్టుపై తిరుగులేని రికార్డున్న అశ్విన్ ను ఎంపిక చేయకపోవడం షాక్ కు గురి చేసిందని వ్యాఖ్యానించారు. విండీస్ పై అశ్విన్ 11 టెస్టుల్లో 60 వికెట్లు తీయగా... నాలుగుసార్లు ఐదేసి వికెట్ల ఘనత సాధించాడు. అలాగే బ్యాట్ తోనూ రాణించి 552 పరుగులు చేసిన అశ్విన్ ను ఎందుకు పక్కన పెట్టారో అర్థం కాలేదని సన్నీ అభిప్రాయపడ్డారు. కాగా అశ్విన్ ను తుది జట్టుకు ఎంపిక చేయకపోవడంపై వైస్ కెప్టెన్ రహానే వివరణ ఇచ్చాడు. జట్టు మేనేజ్ మెంట్ ఎప్పుడూ అత్యుత్తమ కూర్పు కోసమే ప్రయత్నిస్తుందని, బౌలింగ్ చేయగలిగే ఆరో బ్యాట్స్ మెన్ అవసరం అనుకున్న కారణంగానే ఈ పిచ్ పై జడేజాను తీసుకున్నట్టు చెప్పాడు. దీనిపై కోచ్ , కెప్టెన్ కూడా మాట్లాడుకునే నిర్ణయం తీసుకున్నారని వివరించాడు. రోహిత్ , అశ్విన్ లాంటి ఆటగాళ్ళను రిజర్వ్ బెంచ్ కు పరిమితం చేయడం చాలా కష్టంతో కూడుకున్నా... జట్టు ప్రయోజనాల కోసం తప్పలేదంటూ వ్యాఖ్యానించాడు. ఏదేమైనా తొలి టెస్టులో ఫలితం అటు ఇటూ అయితే మాత్రం తుది జట్టు ఎంపికపై మరిన్ని విమర్శలు వెల్లువెత్తడం ఖాయంగా కనిపిస్తోంది.

## క్రీజులో ఉన్నంత వరకు జట్టు గురించే ఆలోచిస్తా: రహానే

ఆంటిగ్వా,ఆగస్ట్24 (ఆంఎన్ఎ): విండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా వైస్ కెప్టెన్ అజింక్యా రహానే క్రీజులో పాతుకుపోయి 81 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. వికెట్లు టపటపా పడిపోతున్న వేళ కీలక ఇన్నింగ్స్ ఆడిన రహానే సెంచరీకి 19 పరుగుల ముందు అవుటై నిరాశపరిచాడు. 2017 లో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌లో శతకం చేసిన రహానే మళ్లీ ఇప్పటి వరకు సెంచరీ చేయలేదు. నిన్నటి ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత రహానే మాట్లాడుతూ.. మీడియా అడిగిన ప్రశ్నకు అదిరిపోయే సమాధానం చెప్పాడు. సెంచరీ చేజార్చుకోవడంపై రహానే మాట్లాడుతూ.. మీడియా ఇటువంటి ప్రశ్న అడుగుతుందని తనకు ముందే తెలుసన్నాడు. సెంచరీ చేజారినందుకు తనకు బాధగా లేదన్నాడు. తాను క్రీజులో ఉన్నంత వరకు జట్టు గురించే ఆలోచిస్తానని అన్నాడు. 81 పరుగుల వద్ద ఉన్నప్పుడు తాను శతకం కోసం ఆలోచించలేదన్నాడు. 25 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన సమయంలో సెంచరీ గురించి ఆలోచించడం కంటే జట్టు గురించి ఆలోచిస్తేనే బాగుంటుందని రహానే పేర్కొన్నాడు.

## సెమీస్‌లో సింధు , సాయి

### రెండు పతకాలు ఖాయం




బేసల్,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): వరల్డ్ ఛాంపియన్ షిప్ లో భారత్ కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. తెలుగుతేజాలు పూసర్ల వెంకట సింధు , సాయి ప్రణీత్ సెమీఫైనల్‌కు దూసుకెళ్ళారు. సింధు ఐదోసారి సెమీస్ కు చేరితే... సంచలనాలతో చెలరేగుతోన్న సాయిప్రణీత్ తొలిసారి వరల్డ్ ఛాంపియన్ షిప్ సెమీస్ లో అడుగుపెట్టాడు. హోరాహోరీగా సాగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సింధు 12-21,23-21,21-19 స్కోర్ తో రెండో సీడ్ తైజుయింగ్ పై విజయం సాధించింది. గంటా పదకొండు నిమిషాలు సాగిన ఈ పోరులో విజయం కోసం ఇద్దరూ నువ్వా నేనా అన్నట్టు తలపడ్డారు. తొలి గేమ్ లో సింధు పెద్దగా పోటీ ఇవ్వలేకపోయిన ప్పటికీ... రెండో గేమ్ లో మాత్రం అద్భుతంగా పుంజుకుంది. ఒక దశలో మ్యాచ్ చేజారిపోయిందను కున్నప్ప టికీ... పోరాడిన సింధు 23-21 తో గేమ్ గెలిచి స్కోర్ సమం చేసింది. ఇక మ్యాచ్ డిసైడి ంగ్ మూడో గేమ్ లోనూ ఇద్దరూ పట్టుదలతో ఆడారు. పలుసార్లు ఆధిపత్యం చేతులు మారినా... చివరికి సింధుదే పైచేయిగా నిలిచింది. ఈ విజయంతో సెమీస్ కు చేరిన సింధు కనీసం కాంస్యం ఖరారు చేసుకుంది. వరల్డ్ ఛాంపియన్ షిప్ లో సెమీస్ కు చేరడం సింధు కెరీర్ లో ఇది ఐదో సారి. 2013 , 2014 లలో వరుసగా సెమీస్ చేరిన ఈ తెలుగుతేజం... తాజాగా గత రెండేళ్ళూ వరుసగా ఫైనల్ కు దూసుకెళ్ళింది. ఇప్పటి వరకూ నాలుగుసార్లు వరల్డ్ ఛాంపియన్ షిప్ గెలిచిన సింధుకు స్వర్ణం మాత్రం అందని ద్రాక్షగానే ఉంది. 2017,2018లో వరుసగా ఫైనల్ చేరిన సింధు చివరి మెట్టుపై బోల్తాపడి రజతంతో సరిపెట్టుకుంది. ఈసారి కూడా పతకం ఖాయం చేసుకున్నప్పటికీ... స్వర్ణంతో తిరిగి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

### సాయిప్రణీత్... అదే జోరు...

అటు పురుషుల సింగిల్స్ లో భమిడిపాటి సాయి ప్రణీత్ అదరగొడుతున్నాడు. ప్రీ క్వార్టర్స్ లో వరల్డ్ నెంబర్ 8 పై సంచలన విజయం సాధించిన సాయి అదే జోరు కొనసాగించి సెమీఫైనల్ కు దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో ఈ తెలుగుతేజం 24-22 , 22-14 స్కోర్ తో నాలుగో సీడ్ జోనాథన్ క్రిస్టే పై సంచలన విజయం అందుకున్నాడు. తొలి గేమ్ లో మాత్రమే సాయికి పోటీ ఎదురైంది. నాలుగో సీడ్ గా ఆడుతోన్న క్రిస్టేతో హోరాహోరీగా తలపడిన సాయిప్రణీత్ 24-22తో గేమ్ గెలుచుకున్నాడు. ఇక రెండో గేమ్ లో మరింత దూకుడుగా ఆడిన తెలుగుతేజం పూర్తి ఆధిపత్యం కనబరిచి 51 నిమిషాల్లో మ్యాచ్ ను ముగించాడు. సాయి ప్రణీత్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ సెమీస్‌కు చేరడం ఇదే తొలిసారి. 2010లో జూనియర్ వరల్డ్ ఛాంపియన్ షిప్ లో కాంస్యం గెలిచిన సాయి ఇప్పుడు సీనియర్ స్థాయిలో పతకం ఖాయం చేసుకున్నాడు. బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ లో సెమీస్ చేరినా కనీసం కాంస్యం దక్కుతుంది. దీంతో ఈ సారి పోటీల్లో భారత్‌కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. కాగా ఇప్పటికే సైనానెహ్వాల్ , కిదాంబి శ్రీకాంత్ టోర్నీ నుంచి నిష్క్రమించారు.

# టిడిపికి కలసిరాని తెలంగాణ

## నేతలు జారుకుంటున్నా నిస్తేజంగా బాబు

## సరైన నాయకత్వం లేకపోవడమే కారణమంటున్న కేడర్

హైదరాబాద్,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పార్టీనేతలు అంతా ఒక్కొక్కరే మెల్లగా ఇతర పార్టీల్లోకి జారుకుంటున్నా, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే అనేకులు ఇరు తెలుగు రాష్ట్రాల్లో తమకు అనుగుణంగా పునాది వేస్తున్నారు. ఏపిలో జగన్‌ను, బిజెపిని, బిజెపిని ఒకే గాటన కట్టి పోరాడతున్న టిడిపికి నేతలు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. అలాగే తెలంగాణలో టిఆర్ఎస్‌ను దెబ్బ కొట్టేందుకు శక్తి చాలక పోవడంతో చతికిల పడడం ఖాయంగా కనిపిస్తోంది. ఎందుకనో తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిడిపి తెలంగాణకు కలిసి రావడం లేదు. కేడర్‌తో పాటు లీడర్లు టిఆర్ఎస్ వైపు దూకేయడంతో ఉన్నవారు నిజాయితీగా పోరాడుతున్నా ఫలితం కానరావడం లేదు. వివిధ సమస్యలపై ఎంతగా ఆందోళనలు చేస్తున్నా కేడర్‌లో ఉత్సాహం నింపలేక పోతున్నారు. అధికార టిఆర్ఎస్‌ను ఎదిరించి నిలువగలిగే సత్తా ఉన్న లీడర్ లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీనికితోడు వీరు కేడర్‌లో భరోసా కూడా నింపలేక పోతున్నారు. ఎమ్మెల్యేలు గీత దాటివెల్లినా కోర్టులో ఊరట దక్కడం లేదు. తాజాగా ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో కూడా ఎలాంటి సానుకూలత లేకుండా పోయింది. టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరాక పొత్తులు పొడుస్తున్నాయి. ఆయనే వెనక ఉండి నడుపుతున్నారన్న భావనా ఉంది. టిడిపి అభ్యర్థులు ఒక్కొక్కరే జారుకోవడంతో తెలంగాణాలో పార్టీ పరిస్తితి ఏమిటన్నది ఇప్పుడు తెలంగాణ టిడిపి నేతల్లో అంతర్మధనం మొదలైనట్లు సమాచారం. మరోవైపు టిఆర్ఎస్‌ను టార్గెట్ చేసుకుని చేస్తున్న విమర్శలు కూడా పెద్దగా ఫలితం ఇవ్వడం లేదు. అనేక అంశాల్లో చేస్తున్న పోరాటాలు ప్రజల దాకా వెళ్లడం లేదు. ఎంతపోరాడినా వ్యతిరేక పరిస్థితులు ఉన్నాయని నేతలు కూడా ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రాంతంలోని తెలుగుదేశం పార్టీ కేడర్‌లో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎపి సిఎం చంద్రబాబు మెప్పు కోసం తెలంగాణ టీడీపీ నేతలు చేస్తున్న పోరాటాలు లేదా ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇక లాభం లేదనుకునే ఇప్పటికే పలువురు తెలంగాణ నేతలు టీడీపీకి గుడ్‌బై చెప్పారు. మరోవైపు రాష్ట్రంలోని కీలక సమస్యలపైన విధానపరమైన నిర్ణయం తీసుకోవడంలో టిడిపి నేతలు అవకాశవాద వైఖరి ప్రజలకు నచ్చడలేదని చెబుతున్నారు. ప్రాంతానికో విధానం అవలంబించడం రాజకీయ పార్టీలకు తగదని విమర్శించారు. సీనియర్ నేతలు, చాలాకాలం పార్టీని అంటిపెట్టుకొని ఉన్నవారు పార్టీని వీడటం టీడీపీకి పెద్ద నష్టమేనని అంగీకరించక తప్పదు. ఈ దశలో తమ ఉమ్మడి శత్రువును ఢీకొనేందుకు రాజకీయ సమీకరణాలు మార్చుకోక తప్పదు. నిజానికి టిడిపి ఆవిర్భావం నాటి వరిస్థితులు, ఇప్పుడున్న పరిస్థితులు వేరుగా ఉన్నాయి. కాంగ్రెస్,టిడిపిల ఉమ్మడి శత్రువు టిఆర్ఎస్, బిజెపిలే కనుక కలసి పోరాడుతున్నా లాభం లేకుండా పోతోంది. అనేక విషయాల్లో అధికార పార్టీని వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్, టిడిపిలు తెరాస వైఫల్యాలను ప్రజలకు వివరించి వారి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నా కూడా ప్రజల్లో సానుకూలత రావడం లేదు.

## ప్రాక్టికల్ విద్యకు దూరంగా పాఠశాల బోధన

### పరికరాలను ఉపయోగించుకోలేక పోతున్న టీచర్లు

హైదరాబాద్,ఆగస్ట్24 (ఆర్ఎన్ఎ): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏటా లక్షల రూపాయలు వెచ్చిస్తూ విలువైన ప్రయోగ పరికరాలు కొనుగోలు చేస్తోంది. అయితే ఆ పరికరాలు బీరువాలో భద్రంగా ఉంటున్నాయి. వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే ఉపాధ్యాయులు దాదాపు 70 శాతం కూడా లేరు. ఈ మేరకు పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. రాజీవ్ విద్యామిషన్ ద్వారా నూతనంగా ఏర్పడే పాఠశాలలకు రూ. 10 వేల చొప్పున కేటాయిస్తున్నారు. ఇవే కాకుండా ప్రతి సంవత్సరం పాఠశాల నిర్వహణకు విడుదలయ్యే నిధుల నుంచి ప్రయోగాల నిర్వహణకు ఖర్చు చేయెచ్చు. కాని ఇది అమలు కావడం లేదు. దీంతో గ్రామీణ విద్యార్థులకు ప్రయోగ పరికరాల పేర్లు కూడా తెలియని పరిస్థితులు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొంటున్నాయి. ఉపాధ్యాయులు శిక్షణ పొందే సమయంలో బోధన పద్ధతుల అధ్యయనం నేర్చుకుంటారు. శిక్షణ ప్రక్రియలో అదే కీలకం. అయితే ఉపాధ్యాయులు వాస్తవ పరిస్థితుల్లో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. వారికి శాస్త్రీయ స్పృహ ఉండటం లేదు. విద్యార్థులకు ప్రయోగాలతో విద్యా బోధన చేపట్టాలన్న తపన సైతం వారిలో కొరవడుతోంది. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను కలిగింపచేసి వారిని ఆ దిశలో ప్రయోగాల వైపు నడిపించాల్సిన ఉపాధ్యాయులు విధి నిర్వాహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు ప్రభుత్వ పాఠశాల్లో మూలన పడ్డ ప్రయోగ పరికరాలు అద్దం పడుతున్నాయి. ప్రయోగాల ఊసే తెలియని విద్యార్థులకు మొబైల్ సైన్స్ ప్రయోగాలతో కొంత ఊరట కలుగుతుంది. సాంకేతిక రంగం పై విద్యార్థులను ప్రాథమిక స్థాయి నుంచే అవగాహన చేసేందుకు ప్రభుత్వం ప్రయోగశాలలను ఏర్పాటు చేసింది. కాగా అధికారుల నిర్లక్ష్యం, ఉపాధ్యాయుల ఉదాసీనతతో అవి నిరుపయోగంగా మారాయి.

# చెరువులు,ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు

## వరిసాగుకు సిద్దం అవుతున్న రైతులు

ఆదిలాబాద్,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల కింద ఎక్కువగా పత్తి, వేరుశెనగ లాంటి పంటలే పండిస్తున్నారు. వీటికి సెప్టెంబర్ తర్వాతే మూడు, నాలుగు తడులు విడుదల చేయనున్నారు. వర్షాలతో ప్రాజెకట్టుల్లో దండిగ ఆనీరు చేరడంతో పత్తి, ఇతర పంటలు పంటలకు సాగునీరు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇక వానాకాలం సీజన్‌లో వరి సాగుకు నీరివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాలో మధ్య తరహా నీటి పారుదల విభాగం కింద మొత్తం 12 సాగు నీటి ప్రాజెక్టులు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో సాత్నాల, మత్తడివాగు, నిర్మల్ జిల్లాలో స్వర్ణ, గడ్డెన్నవాగు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వట్టివాగు, ఎన్టీఆర్ సాగర్, పీపీరావు ప్రాజెక్టు, పెద్దవాగు జగన్నాథపూర్, శ్రీకుమ్రంభీం ప్రాజెక్టు, మంచిర్యాల జిల్లాలో గొల్లవాగు, ర్యాలీవాగు, నీల్వాయి ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా పాజెక్టుల కింద ఇప్పటికే వరి నాట్లు వేస్తుండగా.. మిగతా చోట్ల వేసే పనిలో రైతులు ఉన్నారు. సాత్నాల, మత్తడివాగు, కుమ్రంభీం, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల కింద ఐడీ పంటలకు సాగునీరు ఇచ్చేందుకు నీరు పుష్కలంగా ఉంది. ఇప్పటికే వీటి గేట్లు ఎత్తి భారీగా నీటిని కిందికి వదిలారు. ప్రాజెక్టులు నిర్మించిన చోట కాల్వలు నిర్మించక ఆయకట్టుకు సాగునీరందలేదు. ఇప్పటికే ఎన్టీలు,గడ్డెన్నవాగు కింద వరి సాగుకు నీరు విడుదల చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కింద ఆయకట్టును స్థిరీకరించాల్సి ఉండగా.. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో ఆయకట్టుకు సాగునీరు ఇవ్వనున్నారు. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ చెరువుల కింద మాత్రమే వరి సాగు చేస్తుంటారు. అన్ని చెరువుల్లో నీరు నిండుగా ఉంది. జిల్లాలో చాలా చోట్ల వరి నారు వేయగా.. ఈ నెల చివరికి వరినాట్లు వేయనున్నారు. చెరువుల కింద ప్రస్తుతం వరి నాట్లు ప్రారంభించారు. చెరువులు, కుంటల్లో నీరు చేరి.. నిండుకుండల్లా మారాయి. మిషన్ కాకతీయలో భాగంగా చెరువులను మరమ్మతులు చేసి పునరుద్ధరించడంతో.. జలకళ సంతరించుకున్నాయి. వీటి కింద పూర్తి స్థాయిలో వరి సాగు కానుంది. భూగర్భ జలాలు మెరుగుపడగా.. బోరు, బావుల్లో నీరు పుష్కలంగా ఉండనుంది.ఇక స్వరాష్ట్రంలోనే ప్రాజెక్టుల పనులు కాస్తా పట్టాల కెక్కాయి.. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టుల పెండింగ్ పనులతో పాటు.. కాల్వల నిర్మాణం పూర్తి చేస్తోంది. విడతల వారీగా ఆయకట్టును వృద్ధి చేసి సాగునీరందించే చర్యలు చేపట్టారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలోని సరస్వతి కాలువ, సదర్మాట్, కడెంప్రాజెక్టు కిందపూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు ఇవ్వనున్నారు. గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా 18వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వనున్నారు. జిల్లాలో ఇప్పటికే కడెం ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరదనీరు రావడంతో పూర్తిస్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయి.

# సింగరేణి దుమ్ముతో ప్రాజరోగ్యం పాడు

## ప్రాణాంతక వ్యాధులు పెరగడంపై ఆందోళన

కరీంనగర్,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): సింగరేణి బొగ్గు దుమ్ములోనే ఆ కాలనీలో కొట్టు మిట్టాడుతున్నాయి. కార్మికులు మొర పెట్టుకుంటున్నా కాలుష్యనియంత్రణ చర్యలను ప్రాజెక్టు అధికారులు గాలికి వదిలారు. ఈ ప్రాంతాల్లో ఆస్తమా రోగుల సంఖ్య పెరిగినట్టు– సింగరేణి వైద్యవర్గాలే పేర్కొంటున్నాయి. ఆస్తమా, టీబీ వంటి భయంకరమైన వ్యాధులు ఈ ధూళితో సోకుతున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు. గ్రామస్థులు ఎన్ని సార్లు ఆందోళనలు చేసినా ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారికానీ, ఆర్జీ–2 జీఎం కానీ పట్టించుకున్న పాపాన పోవడం లేదని పేర్కొంటున్నారు. తమ పంట పొలాలను ప్రాజెక్టు విస్తరణ కోసం తీసుకుని ఉపాధి పోగొట్టిన యాజమాన్యం ఇప్పుడు తమ ప్రాణాలను పోగొట్టేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపిస్తున్నారు. సీహెచ్‌పీలో పని చేసే కార్మికుల పరిస్థితి అయితే మరింత దయనీయంగా ఉంది. సీహెచ్‌పీ ఆవరణ మొత్తం దుమ్ముతో నిండిపోతుంది. ఒక్క కార్మిక సంఘం కూడా దీనిపై స్పందించడం లేదు. కాలుష్య నియంత్రణను పర్యవేక్షించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి సీఎస్‌పీ దుమ్ముపై దృష్టి పెట్టడం లేదు. మరో వైపు గోదావరిఖని పట్టణంలోని సీఎస్‌పీ ప్రభావిత ప్రాంతాల్లోని జనం యాజమాన్యంపై ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అవసరమైతే సీఎస్‌పీని మూసేయిస్తామని హెచ్చరికలు చేస్తున్నారు. బొగ్గును త్వరితగతిన రవాణా చేసి రికార్డులు సృష్టించాలనే తాపత్రయానికి పట్టణాన్ని నాశనం చేసే పరిస్థితికి తీసుకువస్తున్నారు. ఓసీపీ–3 ప్రాజెక్టు నుంచి బొగ్గును కన్వేయర్ బెల్ట్ ద్వారా సీఎస్‌పీ బంకర్‌లో పోస్తారు. అక్కడి నుంచి రైల్వేరాక్‌లలో లోడింగ్ చేస్తారు. బంకర్‌లో పోసే బొగ్గు నుంచి ధూళి లేవకుండా ఎప్పటికప్పుడు వాటర్ స్ప్రే చేయాల్సి ఉంటుంది. అలాంటి చర్యలను యాజమాన్యం చేపట్టకపోవడంతో ధూళి విపరీతంగా పైకి లేస్తున్నది. బంకర్‌లో పోసే సమయంలో, రైల్వే లోడింగ్ సమయంలో ధూళి విపరీతంగా లేస్తుంది. ఈ ధూళి సమీపంలోని వీర్లపల్లిని పూర్తిగా కప్పివేస్తున్నది. తెల్లవారేసరికి అర అంగుళం వరకు దుమ్ముపేరుకు పోతుందని గ్రామస్థులు వాపోతున్నారు.రాత్రి పూట అయితే వాటర్ స్ప్రే పూర్తిగా నిలిపివేస్తున్నట్టు తెలుస్తున్నది. ఆ బొగ్గులో చాలా వరకు కాలిపోయి ఉండడం, ధూళి ఎక్కువగా ఉంటున్నట్టు తెలుస్తున్నది. ఇలాంటి పరిస్థితులు తలెత్తితే ప్రాజెక్టులోనే నీటిలో ముందు బొగ్గును డంప్ చేసి తరువాత తడిచిన బొగ్గును డంపర్‌లలో లోడ్ చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా ధూళితో కూడిన బొగ్గును నేరుగా బంకర్‌కు తరలిస్తుంది. టన్నులకొద్ది ధూళి కన్వేయర్ బెల్ట్ ద్వారా రవాణా అవుతుంది.

# విద్యుత్ శాఖలో ఆన్‌లైన్ విధానం

## సర్వీసుల ప్రక్షాళనకు నిర్ణయం?

హైదరాబాద్,ఆగస్ట్24 (ఆర్ఎన్ఎ): విద్యుత్ శాఖలో ఇక ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అన్ని విభాగాలను ఆన్‌లైన్‌గా మార్చేందుకు ఆ శాఖ సన్నాహాలు చేస్తోంది. విద్యుత్ చౌర్యం అరికట్టడం, సమస్యలు త్వరితగతిన పరిష్కరించడం, క్రమపద్ధతిన బిల్లుల వసూళ్లు తదితర సౌకర్యాలు ఒకే గొడుకు కిందకు వస్తాయి. ఇప్పటి వరకు వివిధ శాఖల్లో ఆన్‌లైన్ సేవలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం ఇక విద్యుత్‌రంగాన్ని కూడా సంస్కరించి జవాబుదారితనాన్ని తీసుకరావాలని చూస్తున్నది. ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ నివేదిక ఆధారంగా సరఫరాను వ్యవస్థను అధునీకరించి వాటన్నింటిని సబ్‌స్టేషన్ పరిధిలో, విద్యుత్ బిల్లులు సేకరించే కార్యాలయంలో కంప్యూటరీకరిస్తారు. ఈ విధానం అమలులోకి రాగానే విద్యుత్ సరఫరా వ్యవస్థ పూర్తి స్థాయిలో మెరుగుపడు తుంది.దీంతో వినియోగదారుల సమస్యలను ఆన్‌లైన్ ద్వారానే ఫిర్యాదు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. వీటితో పలు సమస్యలు ఆన్‌లైన్ ద్వారా సత్వర పరిష్కారానికి మార్గం సుగమం అవుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా విద్యుత్ దుబారా, చౌర్యం పూర్తిస్థాయిలో నివారించే అవకాశాలుంటాయని అధికారులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ముందుగా మున్సిపల్ ప్రాంతాల్లో ఈ విధానాన్ని అమలుచేసి అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో ఈ సేవలను విస్తరించనున్నారు. తద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థలోని లోపాలు, సమస్యలు, అక్రమ కనెక్షన్లు, చౌర్యం తదితర అంశాలన్నీ వెలుగుచూస్తాయి. సబ్‌స్టేషన్ నుంచి ఫీడర్, ట్రాన్స్‌ఫార్మర్ వరకు సరఫరా అయ్యే విద్యుత్ వివరాలను సేకరిస్తారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్ నుంచి లైన్ ద్వారా విద్యుత్ స్తంభానికి, అక్కడి నుంచి వినియోగదారుని వరకు సరఫరా వివరాలు సేకరించి పొందుపరుస్తారు.

# యంగ్ లుక్‌లో రవితేజ.. ఫుల్ ఖుష్ అవుతున్న ఫ్యాన్స్



మాస్ మహారాజా రవితేజ షాకింగ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన డిస్కో రాజా అనే చిత్రం చేస్తున్నాడు. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఒక్క క్షణం' చిత్రాల దర్శకుడు వీఐ ఆనంద్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఎస్.ఆర్.టి. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి నిర్మించనున్నారు. 'ఇస్మార్ట్ శంకర్ ' ఫేమ్ నభా నటేశ్‌ను ఓ నాయికగా, 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ పాయల్ రాజ్‌పుత్‌ను మరో నాయికగా ఎంపిక చేశారు. వెన్నెల కిషోర్, సునీల్ ప్రధాన పాత్రలో నటించనున్న ఈ చిత్రానికి ఎస్.ఎస్. తమన్ స్వరకర్త. అయితే ఈ చిత్రం కొంత భాగం చెన్నై నేపథ్యంలో సాగనున్ననేపథ్యంలో తమిళ స్టార్ బాబీ సింహాని ప్రతి నాయకుడిగా ఎంపిక చేశారని తెలుస్తుంది. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్ర ప్రీ లుక్ ఇటీవల విడుదలైంది. త్వరలో పూర్తి లుక్ విడుదల చేస్తామని మేకర్స్ అన్నారు. అయితే చిత్రంలో రవితేజ డ్యూయల్ రోల్ పోషిస్తున్నట్టు తెలుస్తుండగా, తాజాగా యంగ్ లుక్ ఒకటి బయటకి వచ్చింది. ఇందులో రవితేజని చూసిన ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు.

# సాహోలో ఛాన్స్ మిస్ చేసుకున్న కాజల్..!

సినిమా

మరి కొద్ది రోజులలో ప్రేక్షకుల ముందుకు రానున్న సాహో చిత్రం హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన సంగతి తెలిసిందే. హై బడ్జెట్, భారీ కాస్టింగ్‌తో రూపొందిన ఈ చిత్రంలో శ్రీలంకన్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండేజ్ స్పెషల్ సాంగ్ చేసింది. ఇటీవల సాంగ్ ప్రోమో కూడా విడుదల చేశారు. దీనికి భారీ రెస్పాన్స్ వచ్చింది. అయితే ముందుగా కాజల్‌ని స్పెషల్ సాంగ్ కోసం సంప్రదించారట. ఆమె రెండు కోట్ల రెమ్యునరేషన్ డిమాండ్ చేయడంతో చిత్ర బృందం కాజల్ స్థానంలో జాక్వెలిన్‌ని తీసుకున్నట్టు సమాచారం. కాజల్ జనతా గ్యారేజ్ చిత్రంలో ఎన్టీఆర్‌తో స్పెషల్ సాంగ్ చేసిన విషయం తెలిసిందే.

కాజల్ నటించిన కోమలి, రణరంగం చిత్రాలు ఇటీవల ప్రేక్షకుల ముందుకు రాగా, వీటికి మంచి ప్రజాదరణ లభించింది. ఆమె నటించిన 'పారిస్ పారిస్' కూడా విజయం సాధిస్తుందని కాజల్ ధీమాగా ఉంది. మరోవైపు కమల్–శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు2'లో నటిస్తోంది. ఇదీ కాక శివ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో సూర్యతో జతకట్టనుంది కాజల్



## ఫ్యామిలీతో ఇస్మార్ట్ టైం

చాలా ఏళ్ళ తర్వాత ఇస్మార్ట్ శంకర్ అనే మాస్ ఓరియెంటెడ్ చిత్రంతో మంచి హిట్ కొట్టిన పూరీ జగన్నాథ్ త్వరలో విజయ్ దేవరకొండతో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేయనున్నాడు. 2020లో ఈ ప్రాజెక్ట్ మొదలు కానున్నట్టు తెలుస్తుంది. అయితే గత కొద్ది రోజులుగా ఇస్మార్ట్ శంకర్ పనులతో బిజీ బిజీగా ఉన్న పూరీ జగన్నాథ్ ఇప్పుడు కాస్త ఫ్రీ అయ్యాడు. దీంతో ఆయన తన సతీమణి లావణ్య, కూతురు పవిత్రతో కలిసి సరదా టైం స్పెంట్ చేస్తున్నాడు. దీనికి సంబంధించిన ఫోటోని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. పూరీ జగన్నాథ్ తదుపరి ప్రాజెక్ట్‌కి సంబంధించి ఇటీవల ఓ వార్త చక్కర్లు కొట్టింది. ఈ చిత్రానికి ఫైటర్ అనే పేరుని పరిశీలిస్తున్నట్టు ప్రచారం జరిగింది. పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ పతాకాలపై పూరి జగన్నాథ్, ఛార్మి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నది.

# ఐపీఎస్‌లు దేశాభివృద్ధికి పాటుపడాలి

- రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతినకుండా.. ధైర్యంగా విధులు నిర్వర్తించాలి
- స్వదేశీ సంస్థానాల విలీనంకోసం పటేల్ కృషి మరవలేనిది
- జమ్ముకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దుతో పటేల్ ఆశయం నెరవేరింది
- పటేల్ పేరనున్న అకాడమీకి రావడం సంతోషంగా ఉంది
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

హైదరాబాద్, ఆగస్టు24(ఆర్ఎన్ఎ) : ఐపీఎస్‌లు రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతినకుండా ముందుకు సాగుతూ.. మనస్సు చెప్పినట్లు ధైర్యంగా విధులు నిర్వర్తించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సూచించారు. శనివారం నగరంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో 70వ బ్యాచ్ ఐపీఎస్ పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఐపీఎస్ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ అనంతరం అమిత్‌షా బ్యాచ్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో ఉన్న నేషనల్ పోలీసు అకాడమీకి రావడం సంతోషంగా ఉందన్నారు. 70వ బ్యాచ్ లో 12 మంది మహిళా ప్రొబిషనరీలుగా శిక్షణ పూర్తి చేసుకోవడం దేశానికి గర్వకారణమన్నారు. ఐపీఎస్ సాధించడంతోనే యువత ఆశయం పూర్తయినట్లు కాదని అమిత్‌షా పేర్కొన్నారు. నిజాయితీగా సేవ చేసి గౌరవం పొందాలని, దేశాభివృద్ధికి పాటు పడాలని కోరారు. పేదరికంలో మగ్గుతున్న కోట్లాది ప్రజలకు సేవ చేసి వారిని వృద్ధిలోకి తీసుకురావాలని హితవు పలికారు. రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతినకుండా, మనసు చెప్పినట్లు ధైర్యంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు సర్దార్ పటేల్ ఎంతో కృషి చేశారని అమిత్‌షా అన్నారు. స్వదేశీ సంస్థానాల విలీనం కోసం వల్లభాయ్ పటేల్ చేసిన కృషి ఎప్పటికీ మరిచిపోలేనిదని ఆయన కొనియాడారు. తాజాగా జమ్ముకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దుతో పటేల్ ఆశయం పూర్తిగా నెరవేరిందని, ఏన్నో ఏళ్లుగా ఉన్న జమ్ముకశ్మీర్ సమస్యను ప్రధాని మోదీ పరిష్కరించారని అమిత్‌షా అన్నారు. రాజకీయ నాయకులకు కేవలం 5 ఏళ్లు మాత్రమే దేశానికి సేవ చేసే అవకాశముంటుందన్నఅమిత్ షా.. పోలీసులకు 60 ఏళ్ల వరకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ నరసింహన్, తెలంగాణ హోంశాఖ మంత్రి మహమూద్ అలీ తదితరులు హాజరయ్యారు. ఇదిలా ఉంటే ఈ బ్యాచ్‌లో మొత్తం 92 మంది ఐపీఎస్‌లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ బ్యాచ్ నుంచి తెలుగు రాష్ట్రాలకు ముగ్గురు చొప్పున ఐపీఎస్‌లను కేటాయించారు. ఐపీఎస్ శిక్షణలో టాపర్ గా నిలిచిన గౌస్ ఆలంను తెలంగాణకు కేటాయించారు.






## వ్యూహాత్మక వ్యాపార పరివర్తనను ప్రకటించిన టప్పర్‌వేర్ ఇండియా




హైదరాబాద్, ఆగష్టు 24: కిచెన్‌వేర్, హోం వేర్‌తోపాటు పీకశాస్త్ర పరిష్కారాలతో కూడిన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండ్‌గా టప్పర్ వేర్ తన వ్యాపార రంగ వ్యూహాలపై ఈనాడు గణనీయమైన ప్రకటన చేసింది. 2019 ఆగస్ట నుంచి సమర్థవంతమైన మల్టీ చానెల్ వ్యూహం అమలు దిశగా వ్యూహాత్మక పరివర్తన దిశగా బ్రాండ్ అడుగులేసింది. డిజిటల్ పరంగా, భౌగోళికంగా తన ఫుట్ ప్రింట్ పెంచుకునే దిశగా పయనిస్తోంది. వినియోగదారుల పట్ల సమర్థవంతమైన విధేయత ప్రదర్శించే సంస్థ టప్పర్‌వేర్.. భారతదేశంలో తనకుంటూ మార్కెట్ వాటాను పొందేందుకు మరిన్ని చానెళ్లను అందుబాటులోకి తేవడమే టప్పర్ వేర్ లక్ష్యం.

భారతదేశంలో ప్రత్యక్ష విక్రయ బ్రాండ్‌గా నిలిచిన టప్పర్‌వేర్, 70 వేల మంది కన్సల్టెంట్లు, డిస్ట్రిబ్యూటర్లతో కూడిన కుటుంబాన్ని కలిగి ఉంది. గత రెండు దశాబ్దాలకు పైగా లక్షల మంది మహిళలకు సాధికారత కల్పించిన సంస్థగా నిలిచింది టప్పర్ వేర్. లక్షల మంది ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల ఆకాంక్షలను నెరవేర్చేందుకు అవసరమైన మద్దతు, సలహాలతోకూడిన మార్గదర్శకత్వాన్ని అందిస్తోంది. నూతన చానళ్లను ప్రారంభించడం ద్వారా తన వాటాదారులందరూ భవిష్యత్‌లో తగిన వృద్ధి సాధించేందుకు దోహదపడుతోంది. తాజాగా పరివర్తన దిశగా టప్పర్‌వేర్ తన కుటుంబ సభ్యులను ఈ–కామర్స్ వేదికలపై 'టప్పర్ వేర్ అధీకృత విక్రేతలు'గా చేరుస్తాయి.

వ్యాపార పరివర్తనపై టప్పర్ వేర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ ఛాబ్రా స్పందిస్తూ 'ప్రీమియం జీవనశైలికి నిదర్శనం టప్పర్ వేర్. ఎల్లవేళలా వినియోగదారుడిని ఆకర్షిస్తుంది. ప్రత్యేక డిజైన్, నాణ్యత, సౌందర్యం గల బ్రాండ్‌గా టప్పర్ వేర్ నిలిచింది. మా ప్రత్యక్ష విక్రయ విధానం గొప్ప విజయం సాధించింది. కానీ ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో మార్కెటింగ్ వ్యూహాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉంది. నూతన వినియోగదారుల దరికి చేరడంతోపాటు మార్కెట్‌లో వాటా పెంచుకోవడానికి మా విస్తరణ వ్యూహం. మా మల్టీ చానెల్ వ్యూహం నిర్దేశిత లక్ష్యాలను నెరవేరుస్తుందని నేను ధీమాగా ఉన్నాను' అని చెప్పారు.

గత రెండు దశాబ్దాలుగా టప్పర్‌వేర్ శక్తిమంతమైన బ్రాండ్‌గా నిర్మాణంపైనే కేంద్రీకరించింది. టప్పర్‌వేర్ అదనపు టచ్ పాయింట్లతో తన వినియోగదారులను విస్తరించుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలని, అనుభవాన్ని సముపార్జించాలని భావిస్తోంది. 'ఈ–కామర్స్' ఫ్రంట్ వైపు టప్పర్ వేర్ ఉత్పత్తులు తన అధికారిక బ్రాండ్ పోర్టల్‌లో లభిస్తాయి. దీంతోపాటు టప్పర్ వేర్ అధీకృత విక్రేతల ద్వారా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ రిటైల్ దిగ్గజాల వెబ్‌సైట్లలోనూ లభిస్తాయి. మూడు కోట్ల కుటుంబాల దరికి తమ ఉత్పత్తులు చేరాలన్నదే టప్పర్ వేర్ టార్గెట్. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఢిల్లీతోపాటు ముంబై, బెంగళూరు, హైదరాబాద్, సూరత్, అహ్మదాబాద్, పుణె నగరాల్లో 30కి పైగా ఔట్‌లెట్లు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## తెలంగాణ పాఠశాలల్లో జోరుగా హరితహారం

విద్యాసంస్థల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం

హైదరాబాద్,ఆగస్ట్24 (ఆర్ ఎన్ఎ): తెలంగాణలోని అన్ని విద్యా సంస్థల్లో హరితహారం కార్యక్రమాన్ని భారీగా నిర్వహిస్తున్నారు. అన్ని పాఠశాల్లోల పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నారు. విద్యా సంస్థల్లో హరితహారంపై ఇప్పటికే సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. భవిష్యత్ తరాలకు బంగారు భవితవ్యాన్ని అందించాలంటే పర్యావరణాన్ని రక్షించాలనే గొప్ప ఉద్దేశ్యంతో సిఎం కేసిఆర్ రూపొందించిన హరితహారం కార్యక్రమాన్ని విద్యాసంస్థల్లో విజయవంతం చేసేందుకు అధికారుల మధ్య సమన్వయంపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసిఆర్ విద్యాశాఖలో హరితహారం నిర్వహించేందుకు విద్యార్థులతో గ్రీన్ బ్రిగేడ్ లను ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ పరిధిలోని పాఠశాల, ఉన్నత విద్య, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, బీ.ఈడి కాలేజీలు, డి.ఈడి కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలు, యూనివర్శిటీలలో దాదాపు 40 లక్షల మంది విద్యార్థులున్నారని తెలిపారు. వీరికి దాదాపు కోటి పూలు, పండ్ల మొక్కలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ప్రహరీ గోడల పక్కన వీలైనన్ని వరుసల్లో మొక్కలు నాటే విధంగా అక్కడ గుంతలు తీసి సిద్ధం చేయాలన్నారు. విద్యా సంస్థల్లో ఆటస్థలాలు మినహాయించి మిగిలిన ఖాళీ స్థలాల్లో దాదాపు కోటి మొక్కలను బ్లాక్ ప్లాంటేషన్ చేయాలన్నారు. విద్యా సంస్థల్లో హరితహారాన్ని విజయవంతం చేయడంలో భాగంగా విద్యార్థులతో గ్రీన్ బ్రిగేడ్ లను తయారు చేసి వారికి పర్యావరణంపై అవగాహన పెంచాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే స్వచ్ఛ పాఠశాల– హరిత పాఠశాల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మొక్కలు నాటడం, వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం, పాఠశాలనంతటిని శుభ్రంగా ఉంచుకోవడం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.

# వలస కార్మికుల పిల్లలకు విద్య

మెదక్,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): బడీడు పిల్లలను బడిలో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు. వలస కార్మికుల పిల్లలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే అధికారుల సంకల్పం లక్ష్యసాధన దిశగా సాగుతోంది. పని చేస్తున్న చోటే పిల్లలకు బడిని ఏర్పాటు చేసి వారి మాతృభాషలోనే విద్యా బోధన చేస్తున్నారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన వసతి కల్పించడంతో చిన్నారులకు చదువు చెప్పించేందుకు వలస కార్మికులు ముందుకు వస్తున్నారు. జిన్నారం మండలంలో ఎక్కువగా ఇటుక బట్టీలు వెలిశాయి. అందులో పనిచేసి జీవనోపాధి పొందేందుకు ఒడిషా రాష్ట్రం నుంచి అనేక మంది వలస కార్మిక కుటుంబాలు తరలివచ్చాయి. వారి పిల్లలకు విద్య అందక బాలకార్మికులుగా మారే ప్రమాదాన్ని గమనించిన మండల, జిల్లా విద్యాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఒడిషా వలస కార్మికులలో బడీడు పిల్లలు చదువుకు దూరంగా ఉన్నారని గుర్తించారు. వీరికి చదువు అందుబాటులో ఉండే విధంగా ఆయా ప్రాంతాలలోని బట్టీల వద్ద విద్యాకేంద్రాలను ఏర్పాటు చేశారు. అందరికి విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

మధ్యహ్న భోజనం కూడా ఆ పిల్లలకు అందించడంతో మరింత ఉత్సాహంగా పిల్లలు బడికి పెద్ద సంఖ్యలో వస్తున్నారు. విద్యార్థులకు పుస్తకాలు, పలకలు అధికారులు పంపిణీ చేశారు. ఇటుక బట్టీల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి విద్యకు కావలసిన వసతులు కల్పించాలని అధికారులు కోరడంతో ఆ మేరకు వారు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు విద్యను అందిస్తున్నారు.

# రైతుల ఉపాధిని మింగిన సెజ్

## భూములు కోల్పోయిన రైతుల్లో ఆందోళన

నిజామాబాద్,ఆగస్ట్24 (ఆర్ ఎన్ఎ): ప్రత్యేక ఆర్థికమండలి పేరుతో పేద రైతులకు చెందిన 500 ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం రాత్రికి రాత్రే నిర్దాక్షిణ్యంగా గుంజుకుంది. పరిశ్రమ వస్తే ఇంటికొక ఉద్యోగం వస్తుందని అధికారులు ఆశ పెట్టారు. రెండు వేల మందికి ఉపాధి తథ్యమని మురిపించారు. తక్కువ ధరకు అప్పనంగా భూమిని తీసుకున్నారు. ఏళ్లు గడిచినా ఒక్క ఇంటికి కూడా ఉద్యోగం రాలేదు. భూమి మాత్రం కంపెనీ పేరు మీదకు మారిపోయింది. రైతుల పరిస్థితి ఇలా ఉంటే సెజ్‌ల ఏర్పాటు కాగితాలను దాటలేదు. జిల్లాలోని నందిపేటకు సమీపంలోగల లక్కంపల్లి గ్రామంలో పరిశ్రమలను ఏర్పాట చేయడానికి 429.12 ఎకరాల భూమిని కేటాయించారు. అంతకు ముందు రైతుల నుంచి 697 ఎకరాలు సేకరించారు. దశాబ్దాలుగా వ్యవసాయం చేసుకుంటున్న రైతుల అసైన్డ్ భూమిని సేకరించి సెజ్‌కు కేటాయించారు. ఫుడ్ ప్రాసెసింగ్‌తో పాటు వ్యవసాయ ఆధారిత మందులు తయారు చేసే పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఏడాదిలోపే అగ్రిమెంట్ ప్రకారం పరిశ్రమను ప్రారంభించాలి. నకాలంలో పరిశ్రమ ఏర్పాటు– చేయకపోతే భూములు వెనక్కు తీసుకోవాలి. కానీ అధికారులు ఈ పని చేయలేదు. భూమి పోయిన ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో పిల్లల జీవితాలు బాగుపడుతాయని ఆశించి న రైతులు ఎలాంటి తిరుగుబాటు– లేకుండా భూమిని అప్పగించారు. సంబంధిత కంపెనీ వ్యక్తులు భూమిని స్వాధీనం చేసుకున్నారు. కంపెనీల పేరుతో రాజకీయ బినామీ వ్యక్తులే ఈ భూమిని తీసుకున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి.

# పంటలదెబ్బతో నష్టపోతున్న రైతులు

ఆదిలాబాద్,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): గత ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఇప్పుడు అధికా వర్షాలతో నష్టపోయారు. ఇప్పటి వరకు కూడా నష్టపరిహారం అందక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. పత్తిపంటలు లాభదాయకంగా ఉన్నాయని భావించిన రైతులు ఈ సీజన్‌లో విస్తీర్ణన్ని పెంచి అధిక మొత్తంలో పత్తిపంటలు వేసుకున్నారు. ఇక ప్రస్తుతం కూడా మళ్లీ వర్షాలు దెబ్బతీయడంతో నష్టం వెన్నాడుతోంది. దీంతో ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోయి కష్టాల బారిన పడినా పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవడం లేదని వాపోతున్నారు. వేసిన పంటలు చేతికి వస్తాయో రావో అన్న ఆందోళన చెందుతున్నారు. అత్యధికంగా పత్తి పంటలు దెబ్బతిన్నట్లు అధికారుల అంచనా. దెబ్బతిన్న పత్తి పంటలను స్థానిక అధికారుల బృందం పరిశీలించింది. ఒక్కో ఎకరానికి దాదాపు రూ.30 వేలు పెట్టుబడులు పెట్టినప్పటికీ వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి దెబ్బ తిన్నాయి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com